గురువారం
04-05-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 311
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

'ప్రపంచ కార్మిక పోరాటాల విజయం'

ప్రపంచవ్యాపితంగా జరిగే కార్మిక పోరాటాలన్నీ విజయవంతం అవుతాయన్న నినాదంతో లక్షలాది మంది గ్రీస్ కార్మికులు మేడే రోజున దేశవ్యాప్తంగా ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.

2లో

ఏసీబీ మెరుపు దాడులు

పటమట రిజిస్ట్రార్, దుర్గగుడి సూపరింటెండెంట్, కర్నూలు కో-ఆపరేటివ్ ఏఆర్ ఇళ్లలో సోదాలు

పెద్దఎత్తున నగదు, బంగారం స్వాధీనం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఆదాయానికి మించి ఆస్తులు ఉన్న వారిపై ఏసీబీ నిఘా పెట్టింది. తమకు అందిన సమాచారం మేరకు తనిఖీలు జరుపుతూ అక్రమ సొత్తును స్వాధీనం చేసుకుంటోంది. ఇదే క్రమంలో బుధవారం డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు అవినీతి నిరోధక శాఖాధికారులు విస్తృత దాడులు నిర్వహించారు. ప్రముఖ ఆలయాల్లో పనిచేసే అధికారులతో పాటు, రిజిస్ట్రార్ కార్యాలయాలపై ఆకస్మిక దాడులు చేపట్టారు. విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం సూపరింటెండెంట్ వాసా నగేష్ ఇంట్లో సోదాలు నిర్వహించారు. విజయవాడ కుమ్మరిపాలెంలోని లోటస్ లెజెండ్ అపార్ట్‌మెంట్ ఫ్లాట్ ఎఫ్-34లో నివాసంతోపాటు, ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని భీమడోలు, ద్వారకా తిరుమల, నిడదవోలులోని ఆరుచోట్ల తనిఖీలు నిర్వహించారు. ఏవో బంధువుల ఇళ్లలో ఏకకాలంలో సోదాలను అధికారులు చేపట్టారు. కర్నూలు జిల్లాలోని డివిజనల్ కో-ఆపరేటివ్ కార్యాలయం అసిస్టెంట్ రిజిస్ట్రార్ ప్రేమరపోగు సుజాత, ఎన్టీఆర్ జిల్లా పటమట సబ్ రిజిస్ట్రార్ అర్జ రాఘవరావు ఇళ్లలో సోదాలు నిర్వహించారు. అక్రమ ఆస్తుల పత్రాలు, నగదు, వాహనాలు, బంగారాన్ని ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఏసీబీ కాల్ సెంటర్ 14400, ఏసీబీ యాప్‌కు అవినీతి అధికారులపై వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఈ దాడులు జరిగాయి.

విశాఖ ఉక్కు ఉద్యమంపై
ఉక్కుపాదం

- ఆందోళనకారులపై ప్రభుత్వ నిర్బంధకాండ
- ముందస్తు అరెస్టులు, గృహనిర్బంధాలు
- ప్రజాస్వామ్య హననంపై మండిపడ్డ నాయకులు
- మద్దతు అంటూనే వైసీపీ అణచివేత ధోరణి
- అరెస్ట్ చేసిన వారిని పరామర్శించిన రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విశాఖపట్నం ఉక్కు ఉద్యమంపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వైసీపీ వ్యతిరేకమని చెపుతూనే, అందుకోసం జరిగే ఉద్యమాన్ని అణచివేస్తోంది. విశాఖ ఉక్కు పరిరక్షణ వేదిక అధ్వర్యాన బుధవారం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాస్తారోకో కార్యక్రమం నిర్వహించేందుకు సిద్ధం కాగా, రాష్ట్ర ప్రభుత్వం వామపక్ష పార్టీల నాయకులను, కార్మిక సంఘాల నేతలను ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలు చేపట్టి ఆందోళనలను భగ్నం చేసేందుకు ప్రయత్నించింది. పోలీసు బలగాలను ఛేదించుకుని ఆందోళన చేస్తున్న కార్మిక నేతలను బలవంతంగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌లలో నిర్బంధించింది. విజయవాడలో రెండు జాతీయ రహదారులు కలిసే కనకదుర్గమ్మ వారధి వద్ద రాస్తారోకో చేసేందుకు వామపక్ష, కార్మిక సంఘాల నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో బయలుదేరారు. మరోపక్క ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు నేతృత్వంలో లబ్బీపేట రమేశ్ హాస్పటల్ రోడ్డు నుంచి వారధి వద్దకు చేరుకునేందుకు సిద్ధమవుతుండగా నాయకుల్ని పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి భవానీపురం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై ప్రతిపక్ష పార్టీలు, ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ, జగన్ పాలనలో ప్రజాస్వామ్య హననం జరుగుతోందని ధ్వజమెత్తారు. ఉక్కు పోరాటంలో అరెస్టయి భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో ఉన్న నాయకుల్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పరామర్శించారు. ఉద్యమానికి సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ విశాఖ ఉక్కు తెలుగువారి ఆత్మగౌరవానికి చిహ్నమన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రంగా ఉన్నప్పుడు 51 మంది ఉభయ కమ్యూనిస్టు పార్టీలకు చెందిన శాసనసభ్యులు, గౌతు లచ్చన్న సారధ్యంలో స్వతంత్ర పార్టీ సభ్యులు, ఇండిపెండెంట్లు మొత్తం 77 మంది శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు వారి సభ్యత్వాలకు రాజీనామాలు చేసి సాధించుకున్నట్లు తెలిపారు. ఇప్పుడు కూడా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ప్రజాప్రతినిధులు విశాఖ స్టీల్ ఉద్యమంలో కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్టు పార్టీలు, ప్రతిపక్షపార్టీలు మద్దతు ఇస్తున్నాయని చెప్పారు. తెలుగుప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడుకోవటం కోసం అధికార పార్టీ ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని కోరారు. త్వరలో తెలంగాణ రాష్ట్రానికి వెళ్లి అక్కడ ప్రజాప్రతినిధుల మద్దతు కూడగడతామని చెప్పారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి మోదీకి, అదానీకి ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ ప్రైవేటు స్టీల్ కంపెనీలకు గనులు కేటాయించి ప్రభుత్వరంగ సంస్థ అయిన విశాఖ స్టీల్‌కు కేటాయించకపోవటం దారుణమన్నారు. ఏపీ ప్రత్యేక హోదా విభజన హామీల సాధన పోరాట సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ దోమలు కుట్టినట్లు మోదీని చూస్తే వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలు చలిజ్వరంతో వణికిపోతున్నాయని ఎద్దేవా చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఎం జగన్ ఉక్కు ఉద్యమాన్ని అణచివేయటం కాకుండా విశాఖస్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపేందుకు ప్రయత్నిస్తే ప్రజలు హర్షించేవారని చెప్పారు. కార్పొరేట్‌లకు తప్ప సామాన్య ప్రజల గురించి వైసీపీ ప్రభుత్వం ఆలోచించదనే

- మిగతా 2 లో

తుపాను ముప్పు

- 6న వాయుగుండం... 8 నాటికి అల్పపీడనం
- క్రమంగా తుపానుగా మారే అవకాశం
- ఇప్పటికే రాష్ట్రంలో విస్తారంగా కురుస్తున్న అకాల వర్షాలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : బంగాళాఖాతంలో తుపాను ఏర్పడేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) బుధవారం వెల్లడించింది. 6వ తేదీ నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడే అవకాశం ఉందని, ఇది 8న అదే ప్రాంతంలో అల్పపీడనంగా మారే అవకాశం ఉందని, క్రమంగా బలపడి తుపానుగా రూపాంతరం చెందుతుందని వాతావరణ విభాగం అధికారులు వివరించారు. ఎండలు మండిపోయే నడి వేసవిలోనూ అప్పుడప్పుడు తుపానులు సంభవిస్తుండటం తెలిసిందే. అయితే ఈ తుపాను పయనం ఎటువైపు, దీని ప్రభావం ఏ రాష్ట్రాలపై ఉంటుందన్నది ఇంకా స్పష్టత రాలేదని అధికారులు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో

- మిగతా 2 లో

అవినాశ్‌ను అరెస్టు చేయాల్సిందే

- వివేకా హత్య కేసులో సీబీఐ కౌంటర్
- హతుడు పీఏ, వంటమనిషిని విచారించిన సీబీఐ
- మరికొందరు అనుమానితులకు నోటీసులు జారీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తును సీబీఐ వేగవంతం చేస్తోంది. ఏ ఒక్క ఆధారాన్ని వదలకుండా దర్యాప్తు జరుపుతోంది. వివేకా హత్య ఘటనలో లభ్యమైన లేఖపై సీబీఐ విచారణ నిర్వహించింది. మరోపక్క కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ముందస్తు బెయిల్‌పై తెలంగాణ హైకోర్టులో వాదోపవాదాలు జరుగుతున్నాయి. అవినాశ్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో సీబీఐ కౌంటర్ వేసింది. వివేకా హత్య దర్యాప్తుపై సీబీఐ కీలక వివరాలు వెల్లడించింది. అవినాశ్‌ను అరెస్ట్ చేసి కస్టడీలో ప్రశ్నించాల్సిన అవసరం ఉందని కోర్టుకు తెలిపింది. అవినాశ్‌రెడ్డి తండ్రి భాస్కర్‌రెడ్డి అరెస్ట్ తర్వాత ర్యాలీలు జరపడం సాక్షులను ప్రభావితం చేయడమేనని సీబీఐ పేర్కొంది. హత్యాస్థలిలో ఆధారాలు చెరిపివేయడం కుట్రలో భాగమేనని, గొడ్డలి ఎక్కడుందో కస్టడీ విచారణలో తెలుసుకోవాలని కౌంటర్ పిటిషన్‌లో సీబీఐ ప్రస్తావించింది. 'హత్య సందర్భంగా జరిగిన రూ.4 కోట్ల లావాదేవీలపై అవినాశ్‌రెడ్డిని విచారించి తేల్చాలి. సునీల్ యాదవ్‌తో అవినాశ్‌రెడ్డికి సంబంధమేంటో తెలియాలి. హత్య రోజున అవినాశ్ ఇంటికి సునీల్ ఎందుకెళ్లాడో తేల్చాలి. హత్య కుట్రలో ఇంకా ఎవరి ప్రమేయం ఉందో తెలుసుకోవాలి. మార్చి 15న అవినాశ్‌రెడ్డి ఎక్కడెక్కడున్నారో నిర్ధారించాలి. నేరాన్ని తనపై వేసుకుంటే రూ.10 కోట్లు ఇస్తామన్నారని గంగిరెడ్డి ఇచ్చిన వాంగ్మూలంలో వాస్తవం తేల్చాలి. దస్తగిరిని ఓబుల్ రెడ్డి, భరత్ యాదవ్ ఎందుకు కలిశారో తేలాలి. అవినాశ్‌రెడ్డికి వ్యతిరేకంగా వాంగ్మూలానికి సాక్షులు ఎందుకు ముందుకు రావట్లేదు. అవినాశ్ అనుచరుల వల్ల దర్యాప్తునకు ఆటంకం కలగడంతోపాటు అవినాశ్ రెడ్డి దర్యాప్తును, సాక్షులను ప్రభావితం చేస్తున్నారు. ఆయనకు నేర చరిత్ర ఉంది. ఆయనపై ఇప్పటికే నాలుగు క్రిమినల్ కేసులు ఉన్నాయి. అవినాశ్ సాక్షులను ప్రభావితం చేసినట్లు మా దృష్టికి వచ్చింది. కృష్ణారెడ్డి, సీఐ శంకరయ్య, గంగిరెడ్డి ప్రభావితమైనట్లు కనిపిస్తోంది' అని హైకోర్టుకు సమర్పించిన కౌంటర్ పిటిషన్‌లో సీబీఐ పేర్కొంది. కాగా, బుధవారం సీబీఐ విచారణకు వివేకా పీఏ కృష్ణారెడ్డి, వంట మనిషి కొడుకు ప్రకాశ్ హాజరయ్యారు. ఇద్దరినీ కలిపి సీబీఐ అధికారులు అన్ని కోణాల్లో సుదీర్ఘంగా విచారించారు. మంగళవారం వైఎస్ సునీత, ఆమె భర్త రాజశేఖర్ రెడ్డి వాంగ్మూలాన్ని మరోసారి నమోదు చేసిన సీబీఐ అధికారులు...తాజాగా మరికొందరు అనుమానితులకు నోటీసులు జారీ చేశారు. వైఎస్ వివేకా కంప్యూటర్ ఆపరేటర్

- మిగతా 2 లో

పోలవరం ప్రాజెక్టుకు
కేంద్రం మంగళం

2లో

సీఎం తక్షణమే అఖిలపక్షం ఏర్పాటు చేయాలి: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్

మోదీ హయాంలో
పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు

161వ స్థానానికి పడిపోయిన భారత్

ఆర్‌ఎస్‌ఎఫ్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: మీడియా స్వేచ్ఛలో భారత్ 161వ స్థానానికి పడిపోయింది. గతేడాది 150వ స్థానంలో నిలవగా తాజాగా 11 స్థానాలు దిగజారి 161వ ర్యాంకుకు చేరింది. మొత్తం 180 దేశాల్లోని పరిస్థితులను అధ్యయనం చేసిన పారిస్‌కు చెందిన స్వతంత్ర ఎన్‌జీఓ రిపోర్టర్స్ విత్‌ఔట్ బోర్డర్స్ (ఆర్‌ఎస్‌ఎఫ్) బుధవారం గ్లోబల్ ప్రెస్ ఫ్రీడమ్ ఆఫ్ ఇండెక్స్‌ని విడుదల చేసింది. ఈ సూచిలో బంగ్లాదేశ్‌ఆర్‌ఎస్‌ఎఫ్ 163వ స్థానంలో ఉండగా, పాకిస్తాన్ భారత్ కన్నా మెరుగ్గా 150వ స్థానంలో నిలిచింది. తాలిబన్‌ల స్వాధీనంలో ఉన్న అఫ్ఘానిస్తాన్ కూడా 152వ స్థానంలో నిలిచింది. భూటాన్ 90వ ర్యాంకు సాధించగా, శ్రీలంక 135వ ర్యాంకు సాధించినట్లు ఆర్‌ఎస్‌ఎఫ్ తెలిపింది. భారత్ 161వ స్థానానికి పడిపోవడంపై ఆర్‌ఎస్‌ఎఫ్ వివరిస్తూ...2014లో ప్రధాని మోదీ అధికారం చేపట్టిన అనంతరం జర్నలిస్టులపై దాడులు పెరిగిపోయాయని పేర్కొంది. మీడియాలో రాజకీయ పక్షపాత ధోరణి, మీడియా యాజమాన్యాలు ఏకీకృతం కావడం ఇవన్నీ భారత్‌లో మీడియా స్వేచ్ఛను అడ్డుకుంటున్నాయని తెలిపింది. దేశంలోని హిందీ భాషలో మూడొంతుల మంది పాఠకులకు కేవలం నాలుగు వార్తాపత్రికలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ప్రాంతీయ భాషల విషయానికొస్తే... కోల్‌కతాలో ఆనంద్ బజార్ పత్రిక, ముంబైలో లోక్‌మాత్, దక్షిణాదిలో మలయాళ మనోరమ ప్రచురితమవుతున్నాయి. టీవీ రంగంలోనూ ఈ మీడియా యాజమాన్యాలు ఏకీకృతం కావడం కనిపిస్తుంది. ఆల్ ఇండియా రేడియో (ఏఐఆర్) నెట్‌వర్క్ నుండి అన్ని రేడియో స్టేషన్లలోనూ వార్తలు ప్రసారమవుతాయి. ఈ కంపెనీలకు, మోదీ ప్రభుత్వానికి మధ్య బహిరంగంగా పరస్పర ప్రయోజనకరమైన సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇది ఇంకా కొనసాగుతోంది. సుమారు 80 కోట్ల మంది అనుసరించే 70 మీడియా నెట్‌వర్క్‌లు అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ గ్రూప్ అధీనంలో ఉన్నాయి. ఎన్‌డీటీవీని అదానీ ఇటీవల స్వాధీనం చేసుకున్న

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఈయన కూడా అదానీకి దాసోహమే!

ఉత్తరాంధ్ర అభివృద్ధే ధ్యేయం

- ఇక్కడే ఉపాధి అవకాశాలు
- వలసలకు చరమగీతం
- భోగాపురం విమానాశ్రయ శంకుస్థాపన సభలో సీఎం జగన్

విశాలాంధ్ర-విజయనగరం/భోగాపురం: భోగాపురం విమానాశ్రయం నిర్మాణం వల్ల ఉత్తరాంధ్ర రూపురేఖలు మారిపోతాయని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్ఘాటించారు. ఒకప్పుడు ఉత్తరాంధ్ర అంటే వలసలు గుర్తొచ్చేవని, ఇప్పుడు ఉత్తరాంధ్రకే ఉపాధి అవకాశాలు వచ్చేలా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. రాబోయే రోజుల్లో ఉత్తరాంధ్ర జాబ్ హబ్‌గా మారబోతోందన్నారు.

ముఖ్యమంత్రి జగన్ భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. దీనితో పాటు తారకరామ

- మిగతా 2 లో

సెప్టెంబరు నుంచి విశాఖలో కాపురం — సీఎం జగన్ పునరుద్ఘాటన

2లో

'ప్రపంచ కార్మిక పోరాటాల విజయం'

గ్రీస్ వర్కర్ల మేడే నినాదం

ఏథెన్స్: ప్రపంచవ్యాపితంగా జరిగే కార్మిక పోరాటాలన్నీ విజయవంతం అవుతాయన్న నినాదంతో లక్షలాది మంది గ్రీస్ కార్మికులు మేడే రోజున దేశవ్యాప్తంగా ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. కేపిటలిస్ట్ బానిసత్వ సంకెళ్లను తెంచుకోవడమే కాకుండా దానిని పూర్తిగా నిర్మూలించి, దోపిడీదారులు లేని కొత్త సమాజాన్ని కార్మికవర్గం నిర్మించుకోగలదని ఆల్ వర్కర్స్ మిలటరీ ఫ్రంట్ (పేఏఎంఈ) నాయకుడు జియార్గస్ పెరోస్ ఉద్ఘాటించారు. శ్రామిక వర్గం నిత్యం ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వ దూతలెవరూ లేరని నొక్కిచెప్పారు. దోపిడీ వ్యవస్థ అంతానికి మే 22 నుంచి కార్మిక-ప్రజా ఉద్యమాలు, శక్తిమంతమైన కార్మిక సంఘాల ఉద్యమాలు జరగబోతున్నట్లు వెల్లడించారు. ఏథెన్స్ ర్యాలీలో ఫ్రాన్స్ కార్మిక సంఘాల ప్రతినిధుల తరపున మర్సిల్లె లేబర్ సెంటర్ ప్రధాన కార్యదర్శి ఒలివర్ మ్యాత్యూ ప్రసంగించారు. ప్రపంచమంతా కార్మికులు దోపిడీకి గురవుతూనే ఉన్నారన్నారు. ప్రతి స్థాయిలో కార్మికవర్గానికి బలమైన ఉద్యమాలు తప్పడం లేదని, అన్ని స్థాయిల్లో... అన్ని విధాలుగా బలోపేతం కావాలని పిలుపునిచ్చారు. ఆఫ్రికా హాస్పిటాలిటీ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు నికోస్ టకాస్ మాట్లాడుతూ ఆన్‌లైన్ వేదిక 'వోల్ట్'లో రోజుకు 12-14 గంటలు పనిచేసే వారు కంపెనీలో 'భాగస్వాములు'గా ఉన్నారు. వారిని కార్మికులుగా పరిగణించరు. దీంతో వారు తమ కనీస హక్కులను పోగొట్టుకున్నారు అని చెప్పారు. ఏథెన్స్ డెంటిస్ట్రీ స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షుడు దిమిట్రిస్ జియోనిస్ మాట్లాడుతూ 'సంపద సృష్టికి దోహదపడే కార్మికవర్గాన్ని మేము గౌరవిస్తాం' అని అన్నారు. మన జీవితాలను, ప్రయోజనాలను పణంగా పెట్టి విధానాలకు ప్రాధాన్యత ఇవ్వడం అన్నది మనం ఆపితేగానీ ఆగబోదని నొక్కిచెప్పారు. గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి దిమిట్రిస్ కౌట్సోంబస్ ప్రసంగిస్తూ శక్తిమంతమైన కేకేఈ (గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ)తోనే కార్మిక-ప్రజా ఉద్యమానికి బలమన్నారు. మే 21న జరగబోయే ఎన్నికల్లో కేకేఈని బలపర్చాలని కోరారు. పట్టణ, గ్రామీణ స్వీయఉపాధి వర్గాలు, కార్మిక వర్గం సామాజిక కూటమిగా ఏర్పాటు కావాలని, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని, ఈయూ, నాటో చర్యలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. దోపిడీదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా శక్తిమంతమైన పోరాటం అనివార్యమైనదని, ఇందుకు సిద్ధం కావాలని దిమిట్రిస్ కౌట్సోంబస్ నొక్కిచెప్పారు.

కేకేఈకి ఓటేసేందుకు పది కారణాలు:

మే 21న గ్రీస్ పార్లమెంటరీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో గ్రీస్ కమ్యూనిస్టు పార్టీకి ఓటేసేందుకు పది కారణాలను ఆ పార్టీ ప్రజలకు తెలియజేసింది.

1. శక్తిమంతమైన కేకేఈతో ప్రజల జీవితాల్లో సుస్థిరత వస్తుంది. వారి హక్కులకు భద్రత లభిస్తుంది.

నూతన ప్రజాస్వామ్యం.. సిరిజా, పాసోక్ మాట్లాడే పథకాన్ని అనుసరిస్తే అభద్రత, అస్థిరత పెరుగుతాయి.

2. ప్రజాగ్రహం ప్రజాందోళనగా మారాలి. పెరుగుతున్న ధరలు, పేదరికం, యుద్ధాలతో పాటు మనకు కోపం తెప్పించే అన్నింటిపై బలంగా పోరాడగల శక్తి కేకేఈ.

3. ఎన్నికల తర్వాత ప్రతిఘటన సీడ్‌బెడ్లను పెంచుకోవడటానికి ఇదొక్కటే మార్గం.

4. ఎన్‌డీ, సిరిజా, పాసోక్ మధ్య ప్రధాన అంశాలపై ఏకాభిప్రాయం కుదిరింది. 'ఎవరు', 'ఎలా' దేశాన్ని పాలించాలన్నదే వారికి ముఖ్యం. వీరికి విధాపరంగా స్పష్టతున్నది. వాణిజ్య వర్గాల లాభాలపైనే వీరి ఆసక్తి. అమెరికా-నాటో ప్రణాళికలకు వీరు సానుకూలం.

5. వాళ్లు సిద్ధం చేస్తున్న ప్రజా వ్యతిరేక ప్రణాళికలను రద్దు చేయడం కేకేఈతోనే సాధ్యం.

6. కేకేఈకి ప్రజలు, కార్మికుల శ్రేయస్సు, సంక్షేమం, ప్రయోజనాలే ప్రధానం.

7. 'అధికారం కోరుకునే రెండు బడా పార్టీలను ఎంచుకోమన్న' అభిప్రాయం

8. ఎన్నికల తర్వాత కేకేఈ చెప్పినది చేస్తుంది.

9. 'పవర్-గవర్నెన్స్' ప్రణాళికలు కేకేఈ సిద్ధం చేసుకుంది. ప్రజలు మెచ్చే పరిపాలనను ఇవ్వగలుగుతుంది.

10. ప్రజల పక్షాన కేకేఈ నిలుస్తుంది.

ప్రజలే ప్రజలను కాపాడుకోగలరు. కేపిటలిలాన్ని నిర్మూలించగలరు. శక్తిమంతమైన కేకేఈతో ఇది సాధ్యం అని పార్టీ ప్రకటన పేర్కొంది. ప్రజాబలం ముందు అధికార బలం చిన్నబోవాలని పిలుపునిచ్చింది.

ఉత్తరాంధ్ర అభివృద్ధే ధ్యేయం

(మొదటిపేజీ తరువాయి)

తీర్థసాగర్ మిగులు పనులు, చింతపల్లి ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు ఆయన భూమిపూజ చేశారు. అనంతరం సవరవిల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం జగన్ మాట్లాడారు. ఇప్పుడు భోగాపురం విమానాశ్రయానికి భూమిపూజ చేస్తున్నానని, దీనిని తానే జాతికి అంకితమిస్తానని ధీమాగా చెప్పారు. ఉత్తరాంధ్రను అభ్యుదయం స్థాయి నుంచి అభివృద్ధి స్థాయికి తీసుకువెళతామన్నారు. ఇటీవలే శ్రీకాకుళం జిల్లా మూలపేట పోర్ట్‌కు శంకుస్థాపన చేశామని, అది శ్రీకుళంతో పాటు ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. రెండేళ్లలో పనులు పూర్తై అక్కడకు షిప్పులు కూడా వస్తాయన్నారు. మూలపేట ఉత్తరాంధ్రకు మణిహారమైతే, భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్రకు కిరీటమవుతుందన్నారు. విశాఖలో అదానీ డేటా సెంటర్ ప్రారంభిస్తున్నామని చెప్పారు.

భోగాపురం విమానాశ్రయానికి గతంలోనే శంకుస్థాపన చేశామని, మళ్లీ జగన్ చేయడమేమిటని కొంతమంది విమర్శలు చేస్తున్నారని, మీరు శంకుస్థాపన చేస్తే పనులు ఎందుకు ప్రారంభించలేదని జగన్ ప్రశ్నించారు. ఎన్నికల ముందు టెంకాయలు కొట్టి...సిగ్గు లేకుండా తామే శంకుస్థాపన చేశామని చెప్పుకుంటున్నారని టీడీపీ అధినేత చంద్రబాబుపై విమర్శలు గుప్పించారు. తాము అన్ని అనుమతులు తీసుకుని నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నామన్నారు. 5 వేల కోట్ల రూపాయల వ్యయంతో విమానాశ్రయ పనులు చేపట్టామన్నారు. 2026 నాటికి రెండు రన్‌వేలతో విమానాశ్రయం సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. జీఎంఆర్ గ్రూప్ రూ. 4,592 కోట్ల వ్యయంతో 2,203 ఎకరాల విస్తీర్ణంలో 36 నెలల్లో నిర్మాణం పూర్తి చేయనున్నదని చెప్పారు. అవకాశముంటే 30 నెలల్లోనే పూర్తిచేయాలని జీఎంఆర్ అధినేత గ్రంథి మల్లికార్జునరావును సభాముఖంగా కోరారు. ఏడాదికి 60 లక్షల మంది ప్రయాణించేందుకు వీలుగా, పెరుగుతున్న ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఏడాదికి 1.8 కోట్ల మంది ప్రయాణించే విధంగా దశల వారీగా దీని సామర్థ్యాన్ని పెంచి విస్తరిస్తామని సీఎం తెలిపారు. వియానాశ్రయ నిర్మాణ సమయంలో 5 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని, సేవలు ప్రారంభమైన తర్వాత 10 వేల మందికి ప్రత్యక్షంగా, 80 వేల మందికి పరోక్షంగా ఉపాధి దొరుకుతుందన్నారు. పర్యాటక అభివృద్ధి, ఇతర పెట్టుబడుల ద్వారా మరో 5 లక్షల మందికి ఉపాధి కలిగే అవకాశం ఉందన్నారు.

విశాఖపట్నం-భోగాపురం మధ్య రూ.6,300 కోట్లతో 55 కిలోమీటర్ల మేర ఆరు లైన్ల రహదారి నిర్మాణం చేసి దీనికి రెండువైపులా సర్వీసు రోడ్లను నిర్మిస్తామన్నారు. దీనిపై కేంద్రమంత్రి గడ్కరీతో మాట్లాడానని, ఆ పనులకు కూడా నాలుగు నెలల్లో శంకుస్థాపన చేస్తామని జగన్ తెలిపారు. పనిలో పనిగా చంద్రబాబుపైనా, మీడియా, పవన్ కల్యాణ్‌పైనా విమర్శలు చేశారు.

చంద్రబాబు హయాంలో రాష్ట్ర సంపదను దోచుకోవడమేకానీ అభివృద్ధి చేసింది లేదని జగన్ విమర్శించారు. జన్మభూమి కమిటీల పేరుతో టీడీపీ నేతలు దోచుకున్నారని, కొన్ని మీడియాలకు, దత్తపుత్రుడికి దోచి పెట్టారని చెప్పారు. అందుకే చంద్రబాబుకు కొన్ని పత్రికలు, చానళ్లు డప్పుకొడుతున్నాయన్నారు. ఓ వైపు చంద్రబాబు నాయకత్వంలో పెత్తందారులు ఉంటే...మరో వైపు పేదవాడి ప్రభుత్వం ఉందన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేశాము కాబట్టే ధైర్యంగా తాము ప్రజల ముందుకు రాగలుగుతున్నామన్నారు. నలభై ఏళ్లుగా చంద్రబాబు చేయలేని అభివృద్ధిని తాము నాలుగేళ్లలో చేసి చూపించామన్నారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి స్వాగతోపన్యాసం చేశారు. జీఎంఆర్ అధినేత గ్రంథి మల్లికార్జునరావు మాట్లాడుతూ ఇప్పటివరకు 11 విమానాశ్రయాలు నిర్మించామని, భోగాపురం విమానాశ్రయం 12వ దన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో దీనిని నిర్మిస్తామని చెప్పారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ నెల్లిమర్ల నియోజకవర్గం అభివృద్ధికి అవసరమైన సాయం అడిగారు. దీనికి సీఎం స్పందిస్తూ ఆయా పనులకు నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. స్పీకర్ తమ్మినేని సీతారాం, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, గుడివాడ అమర్‌నాథ్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జలవనరుల శాఖ ఈఎన్‌సీ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

తుపాను ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటికే గత కొన్ని రోజులుగా విస్తారంగా అకాల వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం ఉత్తరాంధ్ర జిల్లాల్లో కూడా విస్తారంగా వర్షాలు కురిశాయి. భానుడి భగభగల నుంచి సామాన్యుడికి ఊరట కలుగుతున్నప్పటికీ, రైతులకు మాత్రం తీవ్ర నష్టం వాటిల్లుతోంది. అనేక ప్రాంతాల్లో పంటలు తడిసి పాడైపోతున్న పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో రైతులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో రుతుపవనాల సీజన్ తరహాలో కుండపోత వానలు కురుస్తున్నాయి. సముద్ర మట్టానికి 1.5 కి.మీ ఎత్తు వరకు ద్రోణి/ గాలి కోత నైరుతి మధ్యప్రదేశ్ నుంచి దక్షిణ తమిళనాడు వరకు మరత్వాడా, అంతర్గత కర్నాటక మీదుగా కొనసాగుతోంది. ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టం నుంచి 0.9 కి.మీ ఎత్తులో దక్షిణ చత్తీస్‌గఢ్ పరిసరాల్లో ఉండి కొనసాగుతున్నది. సముద్ర మట్టానికి 3.1 కి.మీ, 5.8 కి.మీ మధ్య దక్షిణ అంతర్గత కర్నాటక తమిళనాడుకు ఆనుకుని ఉన్న ఉపరితల ఆవర్తనము ఇప్పుడు ఉత్తర తమిళనాడు, పొరుగు వరకు ఉండి కొనసాగుతున్నది. 6వ తేదీ నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడే అవకాశం ఉంది. దీని ప్రభావంతో 7న అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, ఇది 8న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనంగా మారే అవకాశం ఉందన్నారు. ఆ తర్వాత, దాదాపు ఉత్తర దిశగా మధ్య బంగాళాఖాతం వైపు కదిలి మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని, పైన తెలిపిన ఉపరితల ఆవర్తనము నుంచి ఉత్తర శ్రీలంక తీరంలో 1.5 కి.మీ-3.1 కి.మీ మధ్య దక్షిణ అంతర్గత కర్నాటక, దానిని ఆనుకుని ఉన్న తమిళనాడు నైరుతి బంగాళాఖాతం వరకు ఉందని, అయితే ఇప్పుడు తక్కువగా గుర్తించబడిందని విశాఖ వాతావరణ శాఖ తెలిపింది.

మోదీ హయాంలో పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు

(మొదటిపేజీ తరువాయి)

సంగతి తెలిసిందే. మోదీ అధికారం చేపట్టిన అనంతరం అనేకమంది జర్నలిస్టులు వేధింపులు ఎదుర్కొంటున్నారు. జర్నలిస్టులపై దేశద్రోహం, పరువునష్టం, కోర్టు ధిక్కారం, జాతీయ భద్రత చట్టాలతో పాటు తిరుగుబాటుదారులన్న ముద్ర వేస్తోంది. మీడియాలో ఉన్నత కులాలకు చెందిన పురుషులు జర్నలిజంలో సీనియర్ పదవులు కలిగి ఉండటం లేదా మీడియా ఎగ్జిక్యూటివ్‌లుగా ఉంటున్నారు. ఇది మీడియా కంటెంట్‌లో ప్రతిబింబిస్తుంది. సాయంత్రం వేళల్లో వచ్చే ప్రధాన చర్చా కార్యక్రమాల్లో పాల్గనేవారిలో 15 శాతం కంటే తక్కువ మంది మహిళలు ఉన్నారు. భారత్‌లో జర్నలిస్టుల భద్రతకు ఎలాంటి చర్యలు లేవు. యేటా సగటున నలుగురు జర్నలిస్టులలో ముగ్గురు హత్యకు గురవుతున్నారు. మీడియా రంగానికి ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన దేశాల్లో భారత్ ఒకటని ఆర్ఎస్ఎఫ్ స్పష్టం చేసింది.

అవినాశ్‌ను అరెస్టు చేయాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

ఇనయ్ తుల్లా, ఉదయ్ కుమార్ తండ్రి ప్రకాశ్‌రెడ్డిలను సీబీఐ మరోసారి ప్రశ్నించింది. ఈ కేసులో ప్రత్యక్ష సాక్షి ఇనయ్ తుల్లా అనే వ్యక్తి ఉన్నాడు. వివేకా మృతదేహాన్ని బాత్‌రూమ్ నుంచి బయటకు తీసుకొచ్చింది ఇనయ్ తుల్లానే. గతంలోనే ఇతన్ని పులివెందులలో సీబీఐ విచారించింది. మరోసారి సీబీఐ కార్యాలయానికి పిలిపించి ఇనయ తుల్లాను విచారించి వాంగ్మూలం నమోదు చేసింది. ఇనయతుల్లా, ఉదయ్ కుమార్ తండ్రి ప్రకాశ్‌రెడ్డి వాంగ్మూలాన్ని సైతం సీబీఐ రికార్డ్ చేసింది.

సెప్టెంబరు నుంచి విశాఖలో కాపురం

సీఎం జగన్ పునరుద్ఘాటన

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: సెప్టెంబరులో విశాఖ నుంచి కాపురం పెడుతున్నానని సీఎం జగన్ పునరుద్ఘాటించారు. ఇప్పటికే అనేక బహిరంగసభల్లో చెప్పిన జగన్ బుధవారం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ శంకుస్థాపన అనంతరం జరిగిన బహిరంగసభలోనూ ఇదే ప్రకటన చేశారు. సెప్టెంబర్ నుంచి విశాఖ కేంద్రంగా పాలన ప్రారంభిస్తామని, పరిపాలన వికేంద్రీకరణకే తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆ దిశగా విశాఖను సుందరంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. మరోనాలుగు నెలల్లో భోగాపురం నుండి విశాఖపట్నానికి ఆరు లైన్ల బీచ్ రోడ్డు విస్తరణ పనులు చేపడతామన్నారు.

పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం మంగళం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జాతీయ ప్రాజెక్టుగా పోలవరం నిర్మాణానికి కేంద్రప్రభుత్వం మంగళం పాడుతున్నట్లున్నదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. కేంద్రం చేస్తున్న ద్రోహంపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తక్షణమే స్పందించాలని, అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 'రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాలకు ప్రయోజనకరమైన పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని కేంద్రప్రభుత్వం అటకెక్కించేందుకు కుట్రలుపన్నుతోంది. ప్రాజెక్టు నిర్మాణం పూర్తైతే 7.20 లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతోపాటు, 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. 80 టీఎంసీల నీటిని గోదావరి నుంచి కృష్ణానదికి తరలించడం, కృష్ణానీటిని శ్రీశైలం ద్వారా కృష్ణాడెల్టాకు ఇచ్చే నీటిని అదా చేసి వాటిని రాయలసీమకు ఇవ్వడానికి అవకాశం ఉంటుంది. రాయలసీమ ప్రాజెక్టులైన గాలేరు-నగరి, హంద్రీనీవా లాంటి ప్రాజెక్టులకు కొంతమేర నికరజలాలు కుడి, ఎడమ కాలువల ద్వారా 534 గ్రామాలకు తాగునీరు, విశాఖపట్నానికి 24 టీఎంసీల నీటిని అందించి తాగునీటి అవసరాలతోపాటు పారిశ్రామిక అవసరాలు తీరుతాయి. బాబూ జగజ్జీవన్‌రావు ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా లక్షలాది ఎకరాలకు సాగునీరు ఇవ్వడానికి అవకాశముంటుంది. సెంట్రల్ వాటర్ కమిషన్‌కు అనుబంధంగా ఉన్న టెక్నికల్ ఎడ్వయిజరీ కమిటీ 55,548 కోట్ల రూపాయల ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని ఆమోదించి కేంద్రం ఆర్థికశాఖకు పంపింది. కేంద్ర జలశక్తిశాఖ టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ డీపీఆర్-2ను రూ.47,724 కోట్లకు ఆమోదించాలని ఆర్థిక శాఖ సూచించింది. అయితే ఆర్థికశాఖ 15-03-2017న కేంద్ర కేబినెట్‌లో చర్చించిన అనంతరం రూ.20 వేల కోట్లకు మాత్రమే ఆమోదం తెలుపుతున్నట్లు ప్రకటన చేసింది. ఇప్పుడు రూ.1269 కోట్లు మాత్రమే ఇవ్వాల్సి ఉందని కేంద్ర జలసంఘం చీఫ్ ఇంజనీరు తెలపడం దుర్మార్గం.

పోలవరం ప్రాజెక్టు తొలిదశ నిర్మాణం 41.15 మీటర్ల ఎత్తు వరకేనంటూ కేంద్ర జలశక్తిశాఖ సహాయమంత్రి ప్రహ్లాద్‌సింగ్ పటేల్ పార్లమెంటులో గతంలో ప్రకటించారు. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించే విధంగా పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించాలనే కుట్రతోపాటు, నేడు రూ.1249 కోట్లు మాత్రమే ఇవ్వాల్సి ఉందనడం ఆందోళనకరం. పోలవరం నిర్మాణం, విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణలపై కేంద్రప్రభుత్వ కుట్రలను తీవ్రంగా ఖండిస్తున్నాం. మోదీ ప్రభుత్వం అడుగడుగునా ఏపీకి ద్రోహం చేసున్నా, జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం తగదు. సీఎం ఇప్పటికైనా స్పందించాలి. పోలవరం ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నిర్మించేందుకు కేంద్రంపై ఒత్తిడి తేవాలి. నిధుల విడుదల కోసం నిలదీయాలి. పోలవరం నిర్మాణం, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ అంశాలపై తక్షణమే అఖిలపక్ష సమావేశం నిర్వహించాలి' అని రామకృష్ణ డిమాండ్ చేశారు.

రాంచి కోర్టులోనూ రాహుల్‌కు చుక్కెదురు

రాంచీ (జార్ఖండ్): 'మోదీ ఇంటిపేరు'పై వ్యాఖ్యానించిన 2019 పరువునష్టం కేసులో వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరుతూ కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చేసిన విజ్ఞప్తిని రాంచీలోని ఎంపీ/ఎమ్మెల్యే కోర్టు బుధవారం తిరస్కరించింది. ఇదే కేసులో రాహుల్ గాంధీని సూరత్ కోర్టు దోషిగా నిర్ధారించి రెండేళ్ల జైలు శిక్ష విధించిన వారాల తర్వాత ఇది జరిగింది. దోషిగా తేలడంతో రాహుల్ గాంధీ పార్లమెంటుకు అనర్హుడయ్యాడు. 2019లో కర్నాటకకు చెందిన కోలార్ పట్టణంలో జరిగిన బహిరంగ సభలో రాహుల్ గాంధీ 'మోదీ' ఇంటి పేరుపై వ్యాఖ్యలు చేయడంతో ప్రదీప్ మోదీ అనే న్యాయవాది రాంచీలో ఫిర్యాదు చేశారు. 2019 లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ 'నీరవ్ మోదీ, లలిత్ మోదీ, నరేంద్ర మోదీ... వీరందరికీ మోదీ అనే సాధారణ ఇంటిపేరు ఎలా ఉంది? దొంగలందరికీ మోదీ సాధారణ ఇంటిపేరు ఎలా ఉంది?' అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలు మోదీ ఇంటిపేరు ఉన్న వ్యక్తులందరికీ వ్యతిరేకంగా ఉన్నాయని, అవమానకరమైనవి, పరువు నష్టం కలిగించేవిగా ఉన్నాయని ఫిర్యాదుదారు ఆరోపించారు. పిటిషనర్ కాంగ్రెస్ నేతపై పరువు నష్టం దావా కూడా వేశారు. కాగా జార్ఖండ్‌లో రాహుల్ గాంధీపై మొత్తం మూడు పరువు నష్టం కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఒకటి చైబాసాలో, రెండు కేసులు రాంచీలో. ఇదిలాఉండగా, 'మోదీ ఇంటిపేరు'పై సూరత్ పరువు నష్టం కేసు నుంచి విముక్తి కోసం రాహుల్ గాంధీ కఠినమైన నిరీక్షణ మంగళవారం కనీసం ఒక నెల పాటు పొడిగించింది. గుజరాత్ హైకోర్టు తన ఉత్తర్వులను నెల రోజుల వేసవి విరామం వరకు రిజర్వ్ చేసింది.

విశాఖ ఉక్కు ఉద్యమంపై ఉక్కుపాదం

(మొదటిపేజీ తరువాయి)

విషయం అర్థమవుతుందన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్.బాబూరావు, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు రవిచంద్ర, పి.ప్రసాద్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఎం.రామకృష్ణ తదితరులు అరెస్టయిన వారిలో ఉన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్‌ను హౌస్ అరెస్ట్ చేశారు.

ప్రైవేటీకరణ ఆపే వరకు పోరు: ముప్పాళ్ల

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపే వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతంగా నిర్వహిస్తామని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు హెచ్చరించారు. మంగళగిరి సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 20 సంవత్సరాల నుంచి కేంద్ర ప్రభుత్వాలు స్టీల్ ప్లాంట్ వాటాలు అమ్మాలని ప్రయత్నించినా ఇంతవరకు ఒక్క శాతం కూడా అమ్మలేకపోయారంటే దానికి కమ్యూనిస్టుల పోరాటమే కారణమని అన్నారు. బీజేపీ ప్రభుత్వ కుట్ర వల్ల విశాఖ స్టీల్ నష్టాల్లో ఉందని, 100 శాతం ఉత్పత్తి సామర్థ్యంతో విశాఖ స్టీల్ నడపాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అదానీ, అంబానీ లాంటి బహుళ సంస్థల అధినేతలకి ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కట్టబెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రానున్న కాలంలో విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం మరిన్ని పోరాటాలు కొనసాగిస్తామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేయాలని ముప్పాళ్ల డిమాండ్ చేశారు. సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను నిరసిస్తే అక్రమ అరెస్టులా: జేవీఎస్ఎన్

విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు జరుగుతున్న ఉద్యమానికి సంఘీభావం ప్రకటించి, కార్మికుల పక్షాన నిలబడాల్సిన వైసీపీ ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ నాయకుల అక్రమ అరెస్టులకు పాల్పడటం దుర్మార్గమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి విమర్శించారు. విశాఖలో కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు రాస్తారోకో తలపెట్టగా పోలీసులు పెద్ద ఎత్తున నిర్బంధం ప్రయోగించారు. అనేకమంది నేతలను గృహ నిర్బంధం చేశారు.

రోడ్డెక్కకుండా అరెస్టులతో అడ్డుకున్నారు. జేవీసత్యనారాయణ మూర్తిని ఇంటిలోనే తెల్లవారుజామున హౌస్ అరెస్ట్ చేశారు. ఆయనను బయటికి రాకుండా పోలీసు పహారా కాశారు. సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి మరిపిల్ల పైడిరాజును హౌస్ అరెస్ట్ చేశారు. తగరపువలస, మధురవాడ సీపీఐ, సీపీఎం నాయకులు అల్లు బాబురావు, ఆర్ఎస్ఎన్ మూర్తి, వి.సత్యనారాయణ, డి.అప్పలరాజు, రాజ్ కుమార్ తదితరులను అరెస్ట్ చేసి భీమిలి, పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లలో ఉంచారు. మద్దిలపాలెం జంక్షన్ వద్ద నిరసన తెలపటానికి వెళుతున్న వామపక్ష, ప్రజాసంఘాల నేతలను అరెస్టు చేసి ఎంవీపీ పోలీస్ స్టేషన్‌కి తరలించారు. అరెస్టయిన వారిలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు ఎం.మన్మధరావు, పడాల గోవింద్, జి.వామనమూర్తి, ఎన్.అప్పన్న, వి.నల్లయ్య, ఎం. శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

బీజేపీకి పుట్టగతులు ఉండవు: జల్లి విల్సన్

విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరిస్తే, తెలుగు రాష్ట్రాలలో బీజేపీకి పుట్టగతులు ఉండవని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ శాసనమండలి సభ్యులు జల్లి విల్సన్ హెచ్చరించారు. విజయవాడ - జగదల్పూర్ జాతీయ రహదారిపై ఇబ్రహీంపట్నం వద్ద రాస్తారోకో నిర్వహించారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జల్లి విల్సన్ మాట్లాడుతూ ఎన్నో త్యాగాల ద్వారా సాధించుకున్న విశాఖ ఉక్కును కార్పొరేట్లకు కట్టబెడుతుందని, దీనిని ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమై కాపాడుకోవాలని అన్నారు. జాతీయ కాంగ్రెస్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు బొర్రా కిరణ్, సీపీఎం నాయకులు మహేశ్, ఎంసీపీఐయూ నాయకులు గొల్లపూడి ప్రసాద్, మహిళా సమాఖ్య నాయకురాలు సీహెచ్ దుర్గా కోటేశ్వరరావు, రామసీతా (ఐద్వా) తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను అడ్డుకుని తీరుతాం: జంగాల

రాష్ట్రానికి తలమానికంగా ఉన్న విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను అడ్డుకుని తీరతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ అన్నారు. గుంటూరు శంకర్ విలాస్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకోను అడ్డుకున్న పోలీసులు వారిని అరెస్ట్ చేసి అక్కడి నుంచి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు, పోలీసులకు మధ్య కొంత పెనుగులాట చోటుచేసుకుంది. సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, సీపీఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్, సీఐటీయూ నాయకులు లక్ష్మణ్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ఉల్లిగడ్డ నాగేశ్వరరావు, సీపీఐ(ఎంఎల్) నాయకులు గనిరాజు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలి: దేగా

విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు దేగా ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఏలూరు నగరంలో వసంత మహల్ సెంటర్ వద్ద కార్మిక సంఘాలు, వామపక్ష పార్టీలు, కాంగ్రెస్ పార్టీ, రైతు సంఘాల అధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించాయి. జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి అరటికట్ల రవి, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ప్రసాద్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సిగ్గుచేటు

ఓబులేసు, ఉమామహేశ్వరరావు

విశాలాంధ్రబ్యూరో-అమరావతి: గృహనిర్బంధాలు, అక్రమ అరెస్టులు, రాస్తారోకో చేస్తున్న ఆందోళనకారులను అన్యాయంగా అరెస్టు చేయడం, రోడ్లపైకి వచ్చిన కార్మికులను నిర్బంధించడం జగన్ ప్రభుత్వానికి తగదని విశాఖ ఉక్కు పరిరక్షణ వేదిక కన్వీనర్లు జి.ఓబులేసు(ఏఐటీయూసీ, యు.ఉమామహేశ్వరరావు(సీఐటీయూ) వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వ చర్యను తీవ్రంగా ఖండించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ వేదిక అధ్వర్యంలో ఏప్రిల్ 19వ తేదీన జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో అన్ని పార్టీలు పాల్గొన్నాయని, వైసీపీ తరపున పి.గౌతంరెడ్డి (వైఎస్ఆర్‌టీయూ)పాల్గొని విశాఖ ప్రైవేటీకరణకు జగన్ ప్రభుత్వం వ్యతిరేకమని చెప్పారని, కార్మికుల ఉద్యమానికి రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణంగా మద్దతు ప్రకటిస్తుందని తెలిపారని గుర్తుచేశారు. 29వ తేదీన అన్ని పార్టీలను కలిసి మద్దతు కోరినప్పుడు వైసీపీ కార్యాలయం ఇన్చార్జి, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి సైతం సంపూర్ణ మద్దతు ప్రకటించారని ఓబులేసు, ఉమామహేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కానీ ఈరోజు అరెస్టులు చూస్తుంటే 'పైన పటారం లోన లొటారం' అన్న చందంగా వైసీపీ వైఖరి ఉందని విమర్శించారు. బీజేపీ ప్రైవేటీకరణ విధానాలకు వైసీపీ అనుకూలమని తేటతెల్లమైందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విశాఖ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమానికి నిజాయతీగా మద్దతు ప్రకటించాలని డిమాండ్ చేశారు. దొంగ నాటకాలు ఆడొద్దని హితవు పలికారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా పోలీస్ నిర్బంధాలు సాగించినా వామపక్ష పార్టీలు, స్వచ్ఛంద సంఘాలు, ప్రజాసంఘాలు రాస్తారోకోలను విజయవంతం చేశాయని తెలిపారు. ఆందోళనలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు ప్రకటించారు.

రైతులకు అ'భద్ర'త

ఎగువ భద్రతో రాయలసీమకు తీవ్ర అన్యాయం

ఆంధ్ర, కర్నాటక మధ్య జల జగడాలు

విశాలాంధ్ర-బొమ్మనహళ్: వరద జలాల ఆధారంగా కర్నాటక ప్రభుత్వం ఎగువ భద్ర ప్రాజెక్టు నిర్మాణానికి పూనుకుంది. ఈ నిర్మాణం కారణంగా రెండు తెలుగు రాష్ట్రాలు పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉంది. ముఖ్యంగా రాయలసీమ జిల్లాలు ఎడారిగా మారే అవకాశం ఉందని ఆందోళన నెలకొంది. దిగువ ప్రాంతాల రైతాంగాన్ని బలిపెట్టేలా కేంద్ర ప్రభుత్వం నిర్మాణానికి అనుమతులు ఇవ్వడం సరికాదని అన్నదాతలు పేర్కొన్నారు. నిర్మాణం పూర్తయితే సుంకేసుల, శ్రీశైలం ప్రాజెక్టులపై తీవ్ర ప్రభావం చూపనుంది. ఇక హంద్రీనీవా, పోతిరెడ్డిపాడు పరిస్థితి అగమ్యగోచరంగా మారనుంది. అలాగే హెచ్ఎల్సీ ఎల్ఎల్సీ కాలువల వాటాలకు గండి పడే ప్రమాదం ఉంది. వరద జలాలను తన్నుకుపోయేందుకు కర్నాటక సిద్ధమైంది. బచావత్ బ్రిజేశ్‌కుమార్ కమిటీ నియామకాలను తుంగలో తొక్కి సరికొత్త ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే కేంద్ర జలసంఘం కేంద్ర జలశక్తి శాఖ అనుమతులతో అప్పరభద్ర ప్రాజెక్టు నిర్మాణం చేపట్టింది. ప్రాజెక్టు నిర్మాణంతో తుంగభద్ర ప్రాజెక్టు సుంకేసుల డ్యాం, శ్రీశైలం ప్రాజెక్టులపై వరద జలాల ప్రభావం పడనుంది. ఈ నిర్మాణంతో మునుముందు కర్నాటక, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల మధ్య జలజగడాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో ఆంధ్ర, తెలంగాణకు అన్యాయం జరగనుంది. ఎగువ ప్రాజెక్టు నిర్మాణంతో ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలోని రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారే ప్రమాదం ఉంది. తుంగభద్ర నదిపై 101 టీఎంసీల సామర్థ్యంతో హోస్పేట్ డ్యాం, 1.25 టీఎంసీలతో సుంకేసుల డ్యాం, 216 టీఎంసీల సామర్థ్యంతో శ్రీశైలం ప్రాజెక్టు నిర్మించారు. అందులో శ్రీశైలం, హోస్పేట్ డ్యాములు మల్టీపర్పస్ విధానంలో నిర్వహణ సాగుతుంది. హోస్పేట్ డ్యాం నుంచి హెచ్ఎల్సీ, ఎల్ఎల్సీ కాలువల ద్వారా అనంతపురం, కర్నూలు, వైయస్సార్ కడప జిల్లాలకు సాగునీరు సరఫరా చేస్తున్నారు. హెచ్ఎల్సీకి 32.5 టీఎంసీలు, ఎల్ఎల్సీకి 24 టీఎంసీలు, ఎడమ గట్టు కాలువకు 17.1 టీఎంసీలు నీటిని కేటాయించారు. హెచ్ఎల్సీ కింద 1,90 లక్షల ఎకరాలు, ఎల్ఎల్సీ ద్వారా 1.57 లక్షల ఎకరాలు, ఎడమ గట్టు కాలువ కింద 87 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇప్పటికే హెచ్ఎల్సీ, ఎల్ఎల్సీ, కేసీ కెనాల్ కింద ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీటి సరఫరా కావడం లేదు. వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే ఈ కాలువల కింద సాగు ప్రశ్నార్థకమే. అయితే ఇదేమీ పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం ఎగువ భద్ర డ్యామ్‌కు అనుమతులు ఇవ్వడం శోచనీయం. భద్ర నదిపై జాతీయ హోదా కల్పిస్తూ రూ.12,500 కోట్లతో ప్రాజెక్టు నిర్మించి అందులోకి ఎగువ తుంగ నది నుంచి 17.40 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తారు. ప్రాజెక్టు పరిధిలో దాదాపు 2.25 లక్షల ఎకరాలకు సాగునీరు సరఫరా చేయనున్నట్లు సమాచారం. ప్రాజెక్టు పూర్తయితే వరద జలాల శాతం తగ్గిపోనుంది. దీంతో హోస్పేట్, సుంకేసుల, శ్రీశైలం ప్రాజెక్టులకు వరద జలాల ప్రభావం పడనుంది. ముఖ్యంగా వరద జలాలపై ఆధారపడి నిర్మించిన పోతిరెడ్డిపాడు, హంద్రీనీవా పథకాల నిర్వహణ అగమ్యగోచరమే. ఆంధ్ర, తెలంగాణ ప్రభుత్వాల అభిప్రాయాలు తీసుకోకుండా కర్నాటక ప్రభుత్వం ఎగువ భద్ర నిర్మాణానికి పూనుకోవడం విచారకరం. భవిష్యత్తులో రెండు రాష్ట్రాల మధ్య జలజగడాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. ఇప్పటికే రైతులకు అన్యాయం జరుగుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దిగువ రైతుల కష్టాలు పట్టించుకోకుండా కేంద్రం ఎగువభద్ర డ్యాం నిర్మించి మరింత కష్టాల్లోకి నెట్టింది. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పునరాలోచించి నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన

రైతాంగాన్ని ఆదుకునేందుకు తక్షణ చర్యలు చేపట్టాలి

సీఎంకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో అకాల వర్షాలతో పంటలు నష్ట పోయిన రైతాంగానికి నష్ట పరిహారం చెల్లించటంతో పాటు రైతులను ఆదుకునేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బుధవారం లేఖ రాశారు. గత మూడు రోజులుగా కృష్ణా జిల్లాలో పంట నష్టం జరిగిన ప్రాంతాలలో సీపీఐ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల ప్రతినిధి బృందం పర్యటించి, పరిశీలించిందని తెలిపారు. ఏప్రిల్ 23 నుంచి కురిసిన అకాల వర్షాల వల్ల రాష్ట్రంలో దాదాపు 4 లక్షల ఎకరాల్లో పంట నష్టం సంభవించిందన్నారు. కర్నూలు, అనంతపురం, చిత్తూరు, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, విశాఖపట్నం జిల్లాలలో గత 3 రోజులుగా కుండపోతగా వర్షం కురవడంతో పంటలు నీటిలో కొట్టుకుపోతున్నాయని పేర్కొన్నారు. పసుపు, మొక్కజొన్న, వరి, మిర్చి, శనగ, వేరుశనగ వంటి వాణిజ్య పంటలతో పాటు మామిడి, అరటి, బొప్పాయి, నిమ్మ, దానిమ్మ, బత్తాయి వంటి ఉద్యానవన పంటలు కూడా నేలకొరిగి, నీటిపాలయ్యాయి. చేతికొచ్చిన పంట నష్టపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం పొలం నుంచి రోడ్లపైకి చేర్చేందుకు, పట్టాల అద్దె, కూలీ ఖర్చులకు అధిక మొత్తం ఖర్చవుతోంది. ఒకపక్క పంట నష్టపోయి రైతాంగం అల్లాడుతుంటే, మరోపక్క అది రైతుల పంట కాదని, వ్యాపారుల పంట అని వ్యవసాయాధికారులు అసత్యాలు వెల్లడించడం, అది సాక్షి పత్రికలో ప్రచురితమవ్వడం దుర్మార్గమని పేర్కొన్నారు. వర్షాలకు పంట తడిసిపోవడంతో కలత చెందిన గుంటూరు జిల్లా, చేబ్రోలు మండలం, సేకూరు గ్రామానికి చెందిన పరంధరావు అనే కౌలు రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడం విచారకరం అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం రైతుల పాలిట శాపమయింది. పసుపు, మొక్కజొన్న తదితర పంటలకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఉంటే పంట నష్టం జరిగి ఉండేది కాదు. దీనికి తోడు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరల ప్రకారం పంటల కొనుగోళ్లు జరగటం లేదని తెలిపారు. ఫలితంగా అప్పులు తెచ్చి సాగు చేసిన రైతన్నకు కడగండ్లే మిగులుతున్నాయన్నారు. తెచ్చిన అప్పులు తీర్చే దారిలేక రైతులు అగమ్యగోచరంలో కొట్టుమిట్టాడుతున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉందన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల రాష్ట్రంలో పంట నష్టం జరిగిన ప్రాంతాల్లో తక్షణమే రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులచే పంట నష్టాన్ని అంచనా వేయించి, రైతాంగాన్ని ఆదుకోవాలి. పంట నష్టపరిహారం ఇవ్వడంతో పాటు తిరిగి పంట పెట్టుకునేందుకు సహాయం అందించాలని లేఖలో రామకృష్ణ కోరారు. కౌలు రైతులు వేసిన పంటల నష్టానికి నష్టపరిహారాన్ని కౌలు రైతులకే చెల్లించాలన్నారు. ఉద్యాన, వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.లక్ష చొప్పున, ఆహార పంటలకు ఎకరాకు రూ.40 వేలు చొప్పున నష్టపరిహారం చెల్లించేందుకు తగు చర్యలు చేపట్టవలసిందిగా కోరారు.

టికాబ్స్‌లో కొత్త ప్రయోగం విజయవంతం

హీలికోబాక్టర్ పైలోరి' నివారణకు మందు తయారీ

విశాలాంధ్ర -విశాఖ సిటీ: ఆంధ్రవిశ్వ విద్యాలయం జువాలజీ విభాగంలో నెలకొల్పిన ది సెంటర్ ఫర్ అడ్వాన్స్ అప్లైడ్ బయలాజికల్ సైన్సెస్ అండ్ ఎంట్రప్రూనర్షిప్ (టికాబ్స్) ప్రయోగశాలలో చేపట్టిన ప్రయోగం విజయ వంతమైంది. మానవుల్లో గ్యాస్టిక్ అల్సర్లకు, సంబంధిత క్యాన్సర్‌కు కారణమైన హీలికో బాక్టర్ పైలోరి బాక్టీరియా నివారణకు మందు తయారైంది. ప్రపంచంలో 85-95 శాతం వరకు ఈ బాక్టీరియా కారణంగా గ్యాస్ట్రైటిస్, గ్యాస్ట్రిక్ అల్సర్లు బారిన పడుతుంటారు. ఎంపీ01027 అనే మందును డాక్టర్ యేడిది రవికిరణ్, అర్జున్న మధుమిత తయారు చేయగా అది బ్యాక్టీరియాపై పనిచేసింది. దీంతో పరి శోధన విజయవంతమైంది. ఈ ఇద్దరిని ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి తన కార్యా లయంలో అభినందించారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని ఆవిష్కరణలు చేయాలన్నారు. తాజా పరిశోధనకు ఏయూ ఐపీఆర్ సెంటర్ నుంచి పేటెంటు కోసం దరఖాస్తు చేశారు.

హక్కుల సాధనకు ఉద్యమించాల్సిందే

- రైతాంగానికి రావుల వెంకయ్య పిలుపు
- కమిషన్ల సిఫార్సులు అమలైతే రైతులకు పోరాటాల అవసరం రాదు: కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-చల్లపల్లి: అన్నదాత నేడు అనాథయ్యాడని, దేశంలో రైతులకు రక్షణ లేదని, పంటలకు గిట్టుబాటు ధర రాదని, అప్పుల ఊబిలో రైతన్న కూరుకుపోతున్నాడని అఖిలభారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షులు రావుల వెంకయ్య ఆందోళన వ్యక్తం చేశారు. రోజురోజుకు పెరుగుతున్న సమస్య లకు తోడు పాలకుల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా, హక్కుల సాధన కోసం రైతులంతా సంఘటితంగా పోరాటాలు చేయాల్సిందేనన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కృష్ణాజిల్లా మహాసభ బుధవారం స్థానిక చంద్రరాజేశ్వరరావు వికాస కేంద్రంలోని కొల్లి బుచ్చి కోటేశ్వరరావు సభా ప్రాంగణంలో జరిగింది. మహాసభకు ముఖ్యఅతిథిగా రావుల వెంకయ్య హాజ రయ్యారు. ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చాక ఏ చట్టాలను ఉపసంహరిం చుకొన్న దాఖలాలు లేవని, చారిత్రాత్మక రైతు పోరాటం ఫలితంగా మూడు నల్లచట్టాలను పార్ల మెంటు సాక్షిగా ఉపసంహరించుకొని రైతాంగానికి క్షమాపణలు చెప్పడం అన్నదాతల ఐక్యపోరాట ఫలితమేనని అన్నారు. అదానీ, అంబానీ వంటి వారికి మోదీ సేవకుడని, ప్రజా శ్రేయస్సు ఆయనకు పట్టదని విమర్శించారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ వంటి విధానాలను తేవడమే కాకుండా కార్మిక హక్కులను కాలరాసేలా కోడ్లు తేవడాన్ని వెంకయ్య ప్రస్తావిం చారు. మోదీ ప్రభుత్వం తెచ్చిన చట్టాలకు ఆంధ్రప్ర దేశ్‌లోని వైసీపీ ప్రభుత్వం వత్తాసు పలకడాన్ని ఆక్షేపించారు. మూడు సాగు చట్టాలతో పాటు స్మార్ట్ మీటర్లు, విద్యుత్ బిల్లుకూ జగన్ సర్కార్ మద్దతిచ్చిందని గుర్తుచేశారు. 11 రాష్ట్రాలు విద్యుత్ బిల్లును వ్యతిరేకిస్తే రూ.4వేలకోట్ల రుణం కోసం ఆగమేఘాలపై విద్యుత్ చట్టం అమలునకు జగన్ మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నట్లు వెంకయ్య తెలిపారు. చంద్ర రాజేశ్వరరావు వంటి గొప్ప నాయకులను దేశానికి అందించిన దివితాలూకాలో మహాసభ జరుపుకోవడం సంతోష కరమని అన్నారు. రైతాంగ సమస్యలపై పోరాటాలకు ఈ మహాసభతో నాంది పలకాలని రావుల వెంకయ్య అన్నారు. రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ, దేశంలో రైతు సమస్యల పరిష్కారం కోసం 65 కమిషన్లను అనేక ప్రభుత్వాలు వేసినప్పటికీ వాటి సిఫార్సులను అమలు చేయకుండా నివేదికలను బుట్టదాఖలు చేశాయని విమర్శించారు. కమిషన్ల సిఫార్సులు అమలు చేస్తే రైతులకు పోరాటాల అవసరం రాబోదన్నారు. అధికారంలోకి వస్తే స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేస్తామని, ఒక్క రైతు కూడా ఆత్మహత్య చేసుకొనే పరిస్థితి రానివ్వమని చెప్పిన మోదీ అధికారంలోకి వచ్చాక లక్ష మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నా పట్టించు కోలేదన్నారు. రోజూ రెండువేల మంది సేద్యాన్ని వీడి వలస బాట పడుతున్నారన్నారు. రైతు సంఘం జిల్లా నాయకులు హనుమానుల సురేంద్ర నాథ్ బెనర్జీ, డొక్కు శ్రీనివాసరావు, ముక్కామల ఉమా మహేశ్వర రావు, వేమూరి రత్నగిరిరావు అధ్యక్షవర్గంగా వ్యవహరించిన మహాసభలో రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, జిల్లా అధ్యక్షులు వెలగపూడి ఆజాద్, సీపీఐ ఇంచార్జి కార్యదర్శి టి.తాతయ్య, సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు, ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు ఆర్.పిచ్చియ్య, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లు పెద్ది రత్నకుమారి, రైతు నాయకులు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, పరుచూరి రాఘవేంద్రరావు, వాకా రామచంద్రరావు, పరుచూరి శ్రీనివాసరావు తది తరులు ప్రసంగించారు. రైతు నేతలు గుత్తికొండ రామారావు, అట్లూరి వెంకటేశ్వరరావు, మల్లుపెద్ది బోసు హాజరయ్యారు. తొలుత రైతుసంఘం పతాకాన్ని సీనియర్ నేత పరుచూరి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు తలుపుల సుబ్బారావు అమరవీరుల స్థూపాన్ని ఆవిష్కరించి విప్లవ జోహార్లు అర్పించారు.

వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌పై రాళ్ల దాడి ఘటన

ఆరుగురు యువకుల అరెస్ట్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీ నగర్): వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌పై రాళ్ల దాడికి పాల్ప డిన ఆరుగురు యువ కులను ఆర్పీఎఫ్ అధికారు లు అరెస్ట్ చేశారు. ఇందు లో ముగ్గురు యువకులను జ్యుడీ షియల్ రిమాండ్‌కు పంపగా, మరో ముగ్గురిని జువైనెల్‌కు పంపించారు. గత నెల 28న విశాఖ పట్నం నుంచి సికింద్రాబాద్ వెళుతున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌పై సామర్లకోట-పిఠాపురం స్టేషన్‌ల మధ్య రాళ్ల దాడికి పాల్పడ్డారు. దాంతో రైలును 4 గంటలు రీషెడ్యూల్ చేశారు. దాని కారణంగా ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం కలిగింది. ఘటన అనంతరం రైలులో ఎస్కార్ట్ సిబ్బంది (ఆర్పీఎఫ్) కె.శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. వందే భారత్ రైళ్లలో నిఘా కెమెరాలు అమర్చి ఉన్నందున ఆన్‌బోర్డ్ సీసీటీవీ ఫుటేజిలో లభించిన ఆధారాలతో ఆరుగురు యువకులు ఉన్నట్లు గుర్తించారు. సంఘటన జరిగిన స్టేషన్ల మధ్య శోధనను కొనసాగించడంతో పాటు ప్రదేశానికి దారితీసే అప్రోచ్ రోడ్డులో స్థానిక గ్రామస్తులు, దుకాణదారులను విచారణ చేశారు. రాష్ట్ర పోలీసు అధికారుల సహాయంతో ఆర్పీఎఫ్ అప్రోచ్ రోడ్డులోని సీసీటీవీ ఫుటేజీలను తిరిగి పొందింది. ఆరుగురు యువకులు ఆ ప్రదేశానికి వెళుతున్నట్లు గుర్తించారు. ముందుగా ఒక యువకుడు పట్టుకుని విచారణ చేయగా తప్పు చేసినట్లు అంగీకరించటంతో పాటు మిగిలిన వారి సమాచారాన్ని అందించాడు. దాంతో స్థానిక పోలీసులతో కలిసి వారిని కూడా పట్టుకున్నారు. అయితే ఇందులో ముగ్గురు 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న యువకులు. రైల్వే చట్టంలోని సెక్షన్ 153 కింద కేసు నమోదు చేశారు. 18 ఏళ్ల పైబడిన ముగ్గురు వ్యక్తులను విజయవాడలోని రైల్వే కోర్టులో హాజరుపరచగా ఈనెల 16 వరకు రిమాండ్ విధించారు. ముగ్గురు బాలురును రాజమండ్రిలోని జువైనల్ కోర్టులో హాజరుపరిచి తదుపరి చర్య కోసం జువైనల్ హోమ్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీనియర్ డీఎస్సీ వల్లేశ్వర బాబాజీ తోకల మాట్లాడుతూ తమ అధికారులు, సిబ్బంది కేసును ఛేదించి, రాళ్ల దాడికి పాల్పడిన వారిని పట్టుకున్నందుకు అభినందించారు. రైళ్లపై రాళ్లు రువ్వడం చట్టరీత్యా నేరమని, నేరస్తులపై రైల్వే చట్టంలోని సెక్షన్ 153 ప్రకారం 5 సంవత్సరాల వరకు జైలు శిక్ష విధించే విధంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డీఆర్ఎం శివేంద్ర మోహన్ మాట్లాడుతూ ఇలాంటి ఉదంతాలు ప్రజా ఆస్తులకు నష్టం కలిగించడమే కాకుండా రైలు రీషెడ్యూల్‌కు దారితీసి ప్రయాణికుల విలువైన సమయం వృథా అవుతుందన్నారు. రైళ్లపై రాళ్ల దాడి చేయడం రైల్వే చట్టం ప్రకారం శిక్షార్హమని, ఇటువంటి వాటిని అరికట్టేందుకు ప్రజల మద్దతు తమకు ఎంతో అవసరమని తెలిపారు.

రూ.500కు వంటగ్యాస్

ఏపీ మహిళా సమాఖ్య డిమాండ్

విశాలాంధ్ర-తిరుపతి: వంటగ్యాస్ సిలిండర్‌ను రూ.500కు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య డిమాండ్ చేసింది. మహిళా సమాఖ్య, ఎన్ఎఫ్ఐడబ్ల్యు, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, డీహెచ్‌పీఎస్ అధ్వర్యంలో తిరుపతిలో బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు వి.జయలక్ష్మి మాట్లాడుతూ రూ.500కే గ్యాస్ సిలిండర్‌ను రాజస్థాన్ ఇస్తున్నప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో ఎందుకు ఇవ్వలేరని ప్రశ్నించారు. నిత్యావసరాల ధరలు తగ్గించాలని కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. పేదలను దోచి బడాబాబులకు పెట్టే పాలకుల తీరును ఖండించారు. గతంలో రూ.398 ఉండే వంటగ్యాస్ సిలిండర్ ధర మోదీ హయాంలో రూ.1200కు పెరిగిందని అన్నారు. రాజస్థాన్ మాదిరిగా ఏపీలోనూ రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇవ్వాలని లేకపోతే 2024 ఎన్నికల్లో ప్రజలు తగిన విధంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. తమ డిమాండు సాధన కోసం పోరాటాలకు సిద్ధమని తెలిపారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష-కార్యదర్శులు వీరబోయిన ఉదయ్‌కుమార్, బండి చలపతి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, సహాయ కార్యదర్శి నాగరాజు, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి చిన్నంకాయ, చేతివృత్తుల సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్రయ్య ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి బి.నదియా, నగర కార్యదర్శి ఎన్. మంజుల, నాయకులు విజయ, పార్వతి, అఖిల పాల్గొన్నారు.

దేశ ప్రగతికి డ్రోన్ పరిజ్ఞానం ఎంతో ఉపకరిస్తుంది

ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్

విశాలాంధ్ర-పెనమలూరు: ప్రపంచ భవిష్యత్తులో ప్రముఖ భూమిక పోషిస్తున్న డ్రోన్ పరిజ్ఞానం దేశ ప్రగతికి ఎంతో ఉపకరిస్తుందని ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. బుధవారం మండలంలోని గంగూరు గ్రామ పరిధిలో ఉన్న ధనేకుల ఇంజనీరింగ్ కళాశాల నందు ఇజ్రాయిల్ సంస్థ డ్రోనిక్స్ ఇంజనీరింగ్ టెక్నాలజీస్ సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన డ్రోన్స్ పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని గవర్నర్ ప్రారంభించారు ఈ సందర్భంగా డ్రోన్స్ తయారీ విధానం, అందుకు ఉపయోగించే నాణ్యత కలిగిన పరికరాలు, కెమెరాల వినియోగం, పని తీరు, సాంకేతికత తదితర విషయాలపై నిపుణులు గవర్నర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ 2030 నాటికి భారతదేశం ఈ డ్రోన్ నైపుణ్యంతో మంచి ప్రగతి సాధిస్తుందని అన్నారు. ఈ డ్రోన్ తయారీ రంగంలో నిపుణులకు రానున్న కాలంలో మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జాస్తి చలమేశ్వర్ మాట్లాడుతూ నేటి యువతరం ముందు అనేక అవకాశాలు నిలిచాయని, నైపుణ్య సాధనతో వాటిని అందుకోవటం వారి చేతుల్లోనే ఉందని అన్నారు ఈ సందర్భంగా వివిధ ఇంజనీరింగ్ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్వర్ణ, రజత పతకాలను గవర్నర్ చేతుల మీదుగా అందజేశారు. గవర్నర్ విజేతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో డ్రోనిక్స్ ఇంజనీరింగ్ టెక్నాలజీ సీఈఓ నిర్ జనరల్, కాకినాడ జేఎన్‌టీయూ కళాశాల వైస్ ఛాన్సలర్ జి.వి.కె.ప్రసాద్ రాజు పాల్గొన్నారు. తొలుత కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత గవర్నర్‌కు స్వాగతం పలికారు. కళాశాల చైర్మన్ ధనేకుల రవీంద్రనాథ్ ఠాగూర్, ప్రిన్సిపల్ కె.రవి, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు, ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు మృతి

విశాలాంధ్ర- రంప చోడవరం: చత్తీస్‌గఢ్ రాష్ట్రం గరియాబాద్ అట వీ ప్రాంతంలో పోలీస్ బలగాలకు, మావోయిస్టు దళానికి జరిగిన ఎదురు కాల్పుల్లో ఒక మావో యిస్టు మృతి చెందాడు. మృతి చెందిన మావోయిస్టు వివరాలు తెలియవలసి ఉంది. ఎదురు కాల్పులు జరిగిన స్థలంలో ఒక 303 తుపాకీతో పాటు సాహిత్యం, కొంత మందుగుండు సామాగ్రి, దుస్తులు, కొన్ని వస్తువులు లభించాయని పోలీసులు తెలిపారు. సంఘటనకు సంబంధించిన వివరాలు తెలియవలసి ఉంది. పారిపోయిన మావోయిస్టుల కోసం ప్రత్యేక పోలీస్ బలగాలు గాలింపు చేపట్టాయి.

చేనేతలను ఆదుకుంటాం

బేడ, బుడగ జంగాల ప్రజల సమస్యలన్నీ పరిష్కరిస్తా

కోడుమూరు పాదయాత్రలో నారా లోకేశ్

విశాలాంధ్ర - కోడుమూరు: చేనేత కార్మికుల సమస్య లను పరిష్కరించి, వారిని ఆదుకుంటామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. అలాగే కేంద్రం దృష్టికి తీసుకెళ్లి ఎస్సీలకు వర్తించే సంక్షేమ పథకాలన్నింటినీ బేడ బుడగ జంగాల ప్రజలకు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గ కేంద్రం కోడుమూరు పట్టణ శివారులో ఏర్పాటు చేసిన విడిది కేంద్రం నుంచి బుధవారం ఉదయం లోకేశ్ యువగళం పాదయాత్ర ప్రారంభమైంది. ఎమ్మిగనూరు రహదారిపై స్థానిక తహసిల్దార్ కార్యాలయం నుంచి హంపయ్య సర్కిల్, పాత బస్టాండ్ సెంటర్, కోట్ల సర్కిల్ మీదుగా వెల్దుర్తి రోడ్డు వైపు ఉన్న మాలవీధి మీదుగా మండలంలోని వెంకటగిరి గ్రామం వరకు సాగింది. లోకేశ్‌ను కలిసేందుకు రోడ్డుకు రెండు వైపులా చిన్నారులు, మహిళలు, యువతీయువకులు బారులు తీరారు. లోకేశ్ వారందరినీ కలుసుకొని సమస్యలపై ఆరాతీస్తూ, టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మీ అందరి సమస్యలు తీరుస్తానని హామీలు ఇస్తూ ముందుకు సాగారు. ముఖ్యంగా స్థానిక అంపయ్య సర్కిల్ వద్ద బుడగ జంగాల సామాజిక వర్గం ప్రతినిధులు లోకేశ్‌ను కలుసుకొని సంచార జాతిగా ఉన్న తాము పేదరికంలో మగ్గుతున్నామని, 2008 నాటి జీవో 104 రద్దు చేసి, బేడ బుడగ జంగాల ప్రజలకు ఎస్సీ సర్టిఫికెట్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. లోకేశ్ మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కేంద్రం దృష్టికి తీసుకెళ్లి ఎస్సీలకు వర్తించే సంక్షేమ పథకాలన్నింటిని మీ సామాజిక వర్గానికి అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. అలాగే స్థానిక కోట్ల విజయభాస్కర్ రెడ్డి కాలనీలోని చేనేత కార్మికులతో యువనేత కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా వారు తమకు ముడి సరుకులపై జీఎస్టీ రద్దు చేయాలని, మెగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయాలని, కోడుమూరులో తయారయ్యే చేనేత చీరలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని, చేనేత కార్మికులకు కంప్యూటర్ జకాట్ మగ్గాలను రాయితీపై అందించాలని, కార్మికులకు ఆరోగ్య బీమా పథకాన్ని వర్తింపజేయాలని, రాయితీపై విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందించారు. ఆ నేతలతో లోకేశ్ మాట్లాడుతూ సీఎం జగన్ అసమర్థ చర్యల కారణంగా చేనేత రంగం మరింత సంక్షోభంలో కూరుకుపోయిందని, రాష్ట్రంలోని ఒక్క ధర్మవరంలోనే 55 మంది చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకుంటే ఆ కుటుంబాలను కనీసం పరామర్శించలేదని ఆరోపించారు. చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ రద్దు చేస్తామని, వస్త్రాలకు జాతీయ స్థాయిలో మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని, ప్రతి చేనేత కార్మికుడికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తామని, కంప్యూటర్ జకట్ మగ్గాలను రాయితీపై అందిస్తామని, ఎమ్మిగనూరులో 10,000 మందికి ఉపాధి కల్పించే మెగా టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కోడుమూరు నియోజకవర్గంలో వర్కూరు, కోడుమూరు, వెంకటగిరి చిల్లబండ, ఎర్రదొడ్డి, అనుగొండ గ్రామాల మీదుగా పాదయాత్ర కొనసాగింది. స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి : ఏఐఎస్ఎఫ్

కోడుమూరు నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ యువగళం పాద యాత్రలో భాగంగా నారా లోకేశ్‌కు ఏఐఎస్ఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రంగస్వామి మాట్లాడుతూ కోడుమూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో పేద విద్యార్థులు చదువులను మధ్యలోనే మానేస్తున్నారని తెలిపారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అయినా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కోడుమూరు పట్టణంలో ఉన్న రెండు బీసీ బాలుర పాఠశాలలు, కళాశాల వసతి గృహాలను మూసి వేయడం వలన పేద విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతూ అద్దె భవనాలలో రూమ్ అద్దెలు కట్టుకుంటూ చదువును కొనసాగిస్తున్నారని, బీసీ హాస్టల్‌ను పునఃప్రారంభించేలా చూడాలని లోకేశ్‌ను కోరారు.

సంపాదకీయం

అనాయాస మరణశిక్ష అసాధ్యం

మరణశిక్ష రద్దయ్యే దాకా ఈ అంశంపై న్యాయస్థానాల లోనూ, న్యాయకోవిదుల మధ్య, పౌరహక్కుల సంఘాలవారి లోనూ, లా కమిషన్‌లోనూ చర్చ జరుగుతూనే ఉంటుంది. తాజాగా సుప్రీంకోర్టులో మళ్లీ చర్చ మొదలైంది. అయితే ఇప్పుడు జరుగుతున్న చర్చ మరణ శిక్షను రద్దు చేయాలా వద్దా అన్న విషయం మీద కాదు. ఉరితీయడం ద్వారా కాకుండా మరణ శిక్ష అనాయాసంగా అమలు చేయాలని కోరుతూ న్యాయవాది రిషి మల్హోత్రా దాఖలుచేసిన పిటిషన్ సుప్రీంకోర్టు విచారణలో ఉంది. ప్రాణాంతక ఇంజెక్షన్ ఇవ్వడం, విద్యుదాఘాతంతో అంత మొందించడం లాంటివి ఉరి తీయడంకన్నా అనాయాస మరణాలని రిషి మల్హోత్రా వాదిస్తున్నారు. ఈ లోగా గత మంగళవారం మరణ శిక్ష అమలు చేయడానికి ఉరికి బదులు ప్రత్యామ్నాయ మార్గాలను పరి శీలించడానికి ఓ కమిటీ ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధ పడింది. అంటే మరణ శిక్షను రద్దుచేసే ఉద్దేశం కేంద్ర ప్రభుత్వానికి లేనట్టే. ఇంతకు మునుపటి ప్రభుత్వాలదీ అదే వైఖరి. దీనికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్, జె.బి.పార్డీవాలాతో కూడిన బెంచి అంగీకరించింది. ఈ విషయాన్ని సుప్రీంకోర్టు మళ్లీ జులైలో విచారిస్తుంది. లా కమిషన్ 187వ నివేదికలో కూడా ఉరి తీయడం ద్వారా మరణశిక్ష అమలు చేయడం ఆ శిక్షకు గురయ్యే వ్యక్తికి విపరీతమైన బాధ కలిగిస్తుందని అభిప్రాయపడిందని మల్హోత్రా నివేదించారు. లా కమిషన్ మరణశిక్ష అమలుకు ప్రత్యామ్నాయ విధానాలు అన్వేషించాలని చెప్పిన సందర్భం వేరు. ఒకప్పుడు లా కమిషన్ మరణ శిక్షను రద్దుచేయడాన్ని వ్యతిరేకించింది. ఆ తరవాత 2015లో విడుదలచేసిన నివేదికలో మరణశిక్ష రద్దు చేయాలని సిఫార్సు చేసింది. అప్పుడూ న్యాయ మంత్రిత్వశాఖ ప్రతినిధులిద్దరు మరణశిక్ష రద్దు చేయడాన్ని వ్యతిరేకిస్తూ అసమ్మతి పత్రాలు నివేదికకు జోడించారు. అనేక దేశాలు క్రమంగా మరణశిక్ష రద్దు చేస్తున్న వాస్తవాన్ని లా కమిషన్ గుర్తుచేసింది. తీవ్రవాదులకు, దేశం మీద యుద్ధం ప్రకటించే వారికే మరణశిక్ష విధించాలని చెప్పింది. అనేక దేశాలు మరణశిక్షను పూర్తిగా రద్దుచేస్తే అంతకన్నా ఎక్కువ దేశాలు చట్టపరంగా మరణ శిక్షను రద్దు చేయకపోయినా అమలు చేయడంలేదు. మన దేశంలో మరణశిక్ష ఇప్పటికీ అమలులోనే ఉంది. ఇప్పుడు సుప్రీంకోర్టులో జరుగుతున్న చర్చ ఈ శిక్షను ఆయాసం లేకుండా అమలు చేయడం ఎలా అన్న అంశం చుట్టే తిరుగుతోంది తప్ప మరణ శిక్షను రద్దు చేయడం గురించి కాదు. అరుదాతి అరుదైన సందర్భాలలో మాత్రమే మరణశిక్ష విధించాలని 1980లో బచ్చన్ సింగ్ కేసులో సుప్రీంకోర్టు నిర్దేశించింది. ఈ అరుదాతి అరుదైన సంఘటనలు ఏమిటో నిర్వచించే ప్రయత్నమూ జరిగింది. కానీ అమలు దగ్గరికి వచ్చేటప్పటికి ఏది అరుదాతి అరుదైన సంఘటనో నిర్ణయించడంలో నిర్దిష్ట కేసును విచారిస్తున్న న్యాయమూర్తి అభిప్రాయం కూడా కచ్చితమైన పాత్ర నిర్వహిస్తుంది. కొన్ని కేసులలో మరణశిక్ష విధించి తప్పు చేశామని ఆ తరవాత తీరికగా విచారం వ్యక్తంచేసిన న్యాయమూర్తులూ ఉన్నారు.

మరణశిక్ష విధించడం అనాగరకం అని వాదించే న్యాయమూర్తులూ ఉన్నారు. చట్టంలో ఉంది కనక విధిస్తున్నామని సమర్థించుకునే వారూ ఉన్నారు. కానీ ఏకపక్షంగా మరణశిక్ష విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసిన న్యాయమూర్తులూ ఉన్నారు. ఏకపక్షంగా వ్యవహరించడం అంటే న్యాయమూర్తులు తమ వ్యక్తిగత అభిప్రాయాల ప్రకారం నడుచుకోవడం. అందుకే అరుదాతి అరుదైన సందర్భాలేవో తేల్చడం కష్టం. బచ్చన్ కేసులో నిర్దేశించిన మార్గదర్శక సూత్రాలు అమలులో విఫలమవు తున్నాయి. అన్ని దశల్లోనూ ఒక వ్యక్తికి మరణశిక్ష ఖరారైతే మిగిలిన మార్గమల్లా క్షమాభిక్ష ప్రసాదించాలని రాష్ట్రపతికి మొరపెట్టుకోవడమే. అక్కడా ఓ సమస్య ఉంది. ఈ అర్జీని రాష్ట్రపతి తేల్చడానికి గడువేమీ లేదు. రాజ్యాంగం అమలులోకి వచ్చిన తేదీనుంచి ఇప్పటి వరకు వివిధ రాష్ట్ర పతులు 306 అర్జీలను పరిశీలించి 131 సందర్భాలలో క్షమా భిక్ష ప్రసాదించడానికి నిరాకరించారు. ఒక రాష్ట్రపతి అయితే ఒక్క అర్జీని కూడా తేల్చకుండానే అయిదేళ్ల పదవీకాలం పూర్తిచేశారు. మరణ శిక్ష ఎలా అమలు చేయాలన్న విషయంలో విచారణ పూర్తి అయిన తరవాత తీర్పు ఎలా వస్తుందో ఇప్పుడే చెప్పలేం. కానీ మల్హోత్రా పిటిషన్‌లో మరణశిక్ష రద్దు ప్రస్తావనే లేదు కనక రద్దుచేయాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పే అవకాశంలేదు. అసలుచర్చ జరగవలసింది కిరాతకానికి పాల్పడిన వ్యక్తిని శిక్షించడానికి మరణశిక్ష విధించాలా లేదా అన్న అంశంపైనే. మరణశిక్ష అమలు చేయడం అంటే ఆ శిక్షకు గురైన వ్యక్తిలో పరివర్తనకు అన్ని అవకాశాలనూ మూసేయడమే. శిక్ష లక్ష్యం ఎలాంటి నేరం చేసిన వారికి ఆ మోతాదులో శిక్ష విధించడం మాత్రమే కాదు. కంటికి కన్ను పంటికి పన్ను అన్న రీతిలో శిక్ష ఉండకూడదన్న భావన నాగరకత పెరుగుతున్న కొద్దీ మానవాళికి అలవడుతున్న సుగుణం. ఒక వ్యక్తి ప్రాణం తీయడాన్ని ఎవరూ సమర్థించనక్కర్లేదు. శిక్ష పడాల్సిందే. కానీ ఆ శిక్ష దోషిలో సంస్కరణకు వీలు లేకుండా ఉండకూడదు. మరణ శిక్ష కొనసాగాలనడం మన న్యాయశాస్త్రంలో ఉన్న ప్రధానమైన లోపం. దీన్ని గుర్తించకపోవడం మనం ఇంకా నాగరికులం కాలేదని నిర్ధారించడమే. తప్పు చేసిన వ్యక్తిని శిక్షించే అవకాశం ఉండాల్సిందే. దానికి అవసరమైన చట్టాలు, న్యాయపరిశీలన కూడా అవసరమే. కానీ ఎదుటి వ్యక్తి ప్రాణం తీసిన వ్యక్తిని శిక్షించడానికి అతని ప్రాణం తీయడమే తగిన శిక్ష అనుకోవడం అనాగరకమే. వ్యక్తి చేసిన తప్పును రాజ్య వ్యవస్థ కూడా చేయడమే. రాజ్య వ్యవస్థకు ప్రాణాలు తీసే అధికారం ఇవ్వడం నాగరిక సమాజం అంగీకరించవలసిన అంశం కాదు. మరణ శిక్ష విధించడాన్ని సమర్థించడం అంటే మన న్యాయ నిర్ణయ వ్యవస్థలో ఉన్న లోపాలను సరిదిద్దుకోవడానికి అంగీకరించకపోవడమే. తగిన సాక్ష్యాధారాలు లేక తప్పించుకుంటున్న వారు అసంఖ్యాకంగా ఉండ వచ్చు. కానీ అదే సాక్ష్యాధారాల లోపంవల్ల లేదా కూట సాక్ష్యాలవల్ల, తనకు పడిన మరణశిక్ష నుంచి తప్పించుకోవడానికి చివరిదాకా పోరాడే సామర్థ్యం లేని వారికి అన్యాయం జరిగినట్టే. ప్రాణం పోసే అవకాశం రాజ్యవ్యవస్థకు లేనప్పుడు నేరస్థుడి ప్రాణమైనా సరే తీసే అధికారం రాజ్యవ్యవస్థకు ఉండకూడదు. అలా ఉంటే హంతకుడితో పాటు రాజ్య వ్యవస్థ కూడా హంతకుడిగా మిగిలిపోక తప్పదు. మరణశిక్షను అమలు చేయని దేశాల్లో హత్యలు పెరిగిపోయిన దాఖలాలు లేనట్టే ఈ శిక్ష అమలులో ఉన్న దేశాల్లో హత్యలు తగ్గిన సూచనలూ లేవు. ప్రాణం తీయడం ఏ కిరాతక నేరాన్నీ నిరోధించలేదు. అది పౌరులకు ఉన్న జీవించే హక్కుని హరించడమే.

భారత్‌లో పత్రికాస్వేచ్ఛకు గడ్డుకాలం

డాక్టర్ సి.ఎన్ క్షేత్రపాల్ రెడ్డి, 9059837847

ఒక పత్రిక పదివేల సైన్యంతో సమానం అన్నారు నార్ల వెంకటేశ్వరరావు. ఇదే పద్ధతిలో ఒక పత్రిక స్వేచ్ఛను హరిస్తే పది వేల గొంతుకల నుంచి వ్యక్తమయ్యే అసమ్మతిని అణచివేయవచ్చునని భారత ప్రభుత్వ పెద్దలు తలచినట్టున్నారు. ఇందుకు అనుగుణం గానే దేశంలో పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేసే పనిని తమ రాజకీయ అజెండాలో భాగం చేశారు. మరో పక్క భారత ప్రధానిగా నరేంద్ర మోదీ విశ్వవేదికలపై భారత్ పత్రికా స్వేచ్ఛకు ఆలంబనగా, ఆలవాలంగా నిలుస్తున్నదని ఉపన్యాసాలు ఇస్తూనే ఉంటారు. గత ఏడాది జీ 7 దేశాల సదస్సుకు ఆహ్వానితుడిగా వెళ్లిన సందర్భంలో చేసిన ప్రసంగాన్ని చూస్తే ఆహా భారతదేశంలో పత్రికా స్వేచ్ఛ ఇంతగా వర్ధిల్లుతోందా అనే సందేహం రాకమానదు. అయితే దేశంలోని వాస్తవపరిస్థితి ఇందుకుభిన్నం. కేంద్ర ప్రభుత్వం వ్యవహారశైలిని నిత్యం ఎండగడుతున్న ప్రత్యామ్నాయ మీడియాను కూడా తమ అదుపాజ్ఞల్లోకి తెచ్చుకున్న మోదీ, అమిత్ షాల ద్వయం ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగానే మీడియాపై అణచి వేతను కొనసాగిస్తున్నారు. ఈ పరిస్థితి మీడియా రంగానికి గడ్డుకాలమే.

రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్ అనే మాధ్యమాల పర్యవేక్షణ పరిశోధనా సంస్థ ప్రపంచంలోని 180 దేశాలకు సంబంధించి ఆయా దేశాల్లో అమలవుతున్న పత్రికాస్వేచ్ఛపై జరిపిన సర్వేను విడుదలచేసింది. పత్రికాస్వేచ్ఛలో భారతర్యాంకింగ్ 161గా తేల్చింది. 2023 రిపోర్టును పత్రికాస్వేచ్ఛ దినం నేపథ్యంలో బుధవారం విడుదల చేసింది. ఈ నివేదికను పరిశీలిస్తే దేశంలో పత్రికా స్వేచ్ఛ పాలకుల మాటల్లో తప్ప నిజం కాదని తేలిపోయింది. ఇదే సంస్థ 2022లో విడుదల చేసిన నివేదికలో భారత్ 150వ స్థానంలోనూ, 2021లో 142వ స్థానంలో ఉంది. దీన్ని బట్టి చూస్తే గత మూడేళ్లుగా భారత్‌లో పత్రికా స్వేచ్ఛ అడుగంటిపోతున్న విషయం బహిర్గతమవుతోంది. నార్వే లాంటి చిన్నదేశం పత్రికాస్వేచ్ఛలో ఉన్నతమైన ర్యాంకింగ్ పొందడం... భారత్‌కు పక్కనే ఉన్న శ్రీలంక, భూటాన్ వంటి దేశాలు మనకన్నా మెరుగైన స్థానాల్లో ఉండడం నిజంగా ప్రభుత్వం తలదించుకోవలసిన అంశమే. అతిపెద్ద ప్రజాస్వామ్యదేశం అని గొప్పలు చెప్పుకుంటున్న పాలకులు సన్నగిల్లు తున్న పత్రికాస్వేచ్ఛ వార్తలను ప్రధానపత్రికల్లో రాకుండా అపగలరేమో కానీ ప్రపంచస్థాయిలో పోతున్న మన పరువును కాపాడలేరు.

ఈ దారుణపరిస్థితికి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే కారణం. జర్నలిస్టులపై, తమకు గిట్టని పత్రికల యాజమాన్యాలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలే కక్ష కడుతున్నాయనే విషయం చాలా స్పష్టంగా అర్థమవు తోంది. తమ విధానాలను గుడ్డిగా సమర్థించే సంస్థలను ఒక విధంగా, తమ విధానాలను ప్రశ్నించే మీడియాసంస్థలను మరోవిధంగా చూడడం తెలిసిందే. గత ఎనిమిదేళ్లుగా ప్రధానంగా పాత్రికేయులే లక్ష్యంగా దాడులు తీవ్రమయ్యాయి. ఒక సర్వే ఆధారంగా జర్నలిస్టు లపై నమోదవుతున్న అనేక క్రిమినల్ కేసుల్లో బీజేపీ పాలిత రాష్ట్రం యూపీ అగ్రస్థానంలో ఉంది. 2018లో దేశ వ్యాప్తంగా సంచలనం కలిగించిన ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్ ఘటనకు సంబంధించిన సమాచార సేకరణకోసం కేరళకు చెందిన జర్నలిస్ట్ సిద్దికప్పన్ ఆ ప్రాంతానికి వెళుతుండగానే అక్రమంగా అరెస్టు చేసి జైలులో పెట్టారు. అనంతరం ఆయనపై జాతీయ భద్రతా చట్టం కింద కేసులు పెట్టి వేధింపులకు గురి చేస్తోంది.

కేంద్ర ప్రభుత్వం తీరులోనే వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా జర్నలిస్టులపై నిర్బంధాలకు దిగుతున్నాయి. జర్నలిస్టులకు సాధారణంగా మంజూరు చేసే అక్రిడేషన్లు పెద్ద ప్రహసనంగా మార్చి వేస్తున్నాయి. జర్నలిస్టుల సంక్షేమాన్ని గాలి కొదిలేసిన ప్రభుత్వాలు ఉన్నాయి. జర్నలిస్టులు స్వేచ్ఛగా తమ పని చేయకుండా అడ్డుకునేలా ప్రభుత్వాలే వివిధజీవోలు విడుదల చేయిస్తున్నాయి. ఏపీలో పాఠశాలల విలీనం అంశంపై ఎవరు వార్తలు రాసినా ఆ జర్నలిస్టులపై కేసులు పెట్టాలని గత ఏడాది ఏపీ విద్యాశాఖ వివిధ జిల్లాల డీఈవోలను ఆదేశించిన స్థాయికి ప్రభుత్వ నియంతృత్వం పెరిగింది. పత్రికా స్వేచ్ఛ అనేది రాజ్యాంగం ఇచ్చిన హక్కు అనే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయి. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ ఒక సందర్భంలో మాట్లాడుతూ...పత్రికా స్వేచ్ఛలేకపోతే ప్రజాస్వామ్యం అభివృద్ధి చెందదని...ప్రజాస్వామిక డిమాండ్లు ఎన్నటికీ నెరవేరవని అన్నారు. ప్రభుత్వాలకు పదునైన కలాలు అంటే గిట్టడం లేదు. దేశంలో పత్రికాస్వేచ్ఛ రోజురోజుకూ దిగజారిపోతున్న విషయం బహిర్గతం అవుతున్నా తమ పాలనలో పత్రికా స్వేచ్ఛకు కొదవ లేదని పాలకులు చేస్తున్న వాదన వితండవాదమే అవుతుంది.

కర్నాటకలో బీజేపీ ఓటమికి రైతుల ప్రతిన

అరుణ్ శ్రీవాస్తవ

కర్నాటకలో బీజేపీని మే 10న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించాలని రైతులు నిర్ణయం తీసుకున్నారు. సంయుక్త కిసాన్ పంచాయత్ ఆధ్వర్యంలో బెంగళూరులో రైతులు సమావేశమై శపథం చేశారు. రాష్ట్ర జనాభాలో 65శాతం మంది రైతులు ఉన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రంలోని గ్రామీణ ప్రజలను మోసగించేందుకు గతంలో అనేకసార్లు ఆడిన 'నాటకాలను' మళ్లీ ఆడుతున్నారని రైతులు అభిప్రాయపడుతున్నారు. జనాన్ని సమస్యల నుంచి పక్కదారి పట్టించేం దుకుగాను తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నాటినుంచి కాంగ్రెస్ తనను 91సార్లు తిట్టిందని ప్రచారం చేస్తున్నారు. అయితే మోదీ ఆడుతున్న కపట నాటకాన్ని రైతులు నమ్మడంలేదు. రైతు వ్యతిరేక, ప్రజావ్యతిరేక, మతవాద బీజేపీ అనుకూల చర్యలను నిరసిస్తూ బీజేపీని ఓడించాలని నిర్ణయించారు. ఇంటింటికీ తిరిగి బీజేపీకి ఓటు వేయవద్దని ప్రచారం చేయడానికి రైతులు పూనుకున్నారు. ఈ సమావేశంలో 20 రైతు సంఘాల నుంచి 250 మంది రైతు నాయకులు పాల్గొన్నారు. సమావేశంలో తక్షణం నెరవేర్చవలసిన ఒక డిమాండ్ గాకుండా మరో 15 డిమాండ్లను ప్రకటించింది. 2019-2020లో చేసిన మూడుసాగు చట్టాలను, భూ సంస్కరణల(సవరణ) చట్టాన్ని ఏపిఎంసి సవరణ చట్టాన్ని, పశువధ నిరోధ చట్టాన్ని తక్షణం రద్దు చేయాలని సమావేశం కీలకమైన డిమాండ్ చేసింది.

విద్యుత్ రంగాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరించాలని నిర్ణయం చేసినప్పటికీ రైతులకు సబ్సిడీపైన విద్యుత్ సరఫరా చేయాలి. వ్యవసాయ ఉత్పత్తులన్నిటికీ కనీస మద్దతు ధరకోసం చట్టంచేసి హామీ ఇవ్వాలి. అనేక విపత్తులను ఎదుర్కొంటూ నష్టపోతున్న రైతులకు తగినంత నష్టపరిహారం చెల్లించాలి. రైతుల రుణాలను రద్దు చేయాలి. రైతులకు ఆమోదం లేకుండా రాష్ట్రంలో ఎక్కడా భూమిని ప్రభుత్వం తీసుకోరాదన్న దానితో పాటు అనేక డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం ముందుంచారు.

బీజేపీ కేంద్ర నాయకత్వం కర్నాటక రాష్ట్రాన్ని తమ వలసప్రాంతంగా చూస్తున్నదని సమావేశం విమర్శించింది. అమూల్‌ను అనుమతించడం వాణిజ్య ప్రయోజనాల కోసమేనని విమర్శించారు. కన్నడ రైతులకు ప్రత్యేక గుర్తింపులేకుండా చేయాలని చూస్తున్నారు. మోదీ-అమిత్‌షా ద్వయం అమూల్‌ను నందిని సంస్థలో విలీనం చేయాలని పన్నాగం పన్నారని, ఇది



రైతు వ్యతిరేకమైన నిర్ణయమని రైతు నాయకులు విమర్శించారు. రైతులు గుర్తింపు, ఆత్మగౌరవంపై దాడి జరిగితే సహించబోం అని హెచ్చరించారు. నందినిలో 15 వేలకుపైగా పాల ఉత్పత్తి సహకార సంఘాలున్నాయి. 60లక్షల రైతు కుటుంబాలు ఈ సంస్థ పరిధిలో ఉన్నాయి. కాంగ్రెస్, బీజేపీ, జెడి(ఎస్) పార్టీల నాయకులను కూడా ఈ సమావేశంలో పాల్గొనాలని ఆహ్వానించగా బీజేపీ నాయకులు హాజరు కాలేదు. ఈ సమావేశంలో సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు హన్నన్ మొల్లా, యోగేంద్ర యాదవ్, శ్రీమతి కవిత కూరగంటి, అవిక్‌షాలు పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ప్రముఖ రైతు నాయకులతోపాటు వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టరు ప్రకాశ్ కమ్మరాడి పాల్గొన్నారు. ఈ సమావేశం తర్వాత ఢిల్లీలో సంయుక్త మోర్చా నాయకులు సమావేశమై రెండో దశ రైతు పోరాటం నిర్వహించాలని యోచించారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను తక్షణం నెరవేర్చాలని కేంద్ర వ్యవసాయమంత్రి నరేంద్ర సింగ్ తోమర్‌ను కలుసుకొని మెమొరాండం అందచేశారు. రైతుల డిమాండ్లు నెరవేరుస్తామని కేంద్ర ప్రభుత్వం 15నెలల క్రితం రాత పూర్వక హామీ ఇచ్చింది. రైతుల ఓర్పునకు పరీక్ష పెడుతున్నారు. ప్రభుత్వం ఇంకా నిర్లక్ష్యం చేస్తే రైతులు మళ్లీ ఆందోళన బాటపడతారని మంత్రిని హెచ్చరించారు. స్వామి నాథన్ కమిషన్ కూడా అన్ని పంటలకు కనీసమద్దతు ధరకు చట్టపరమైన హామీ ఇవ్వాలని సిఫారసు చేసింది. ధాన్యాన్ని ప్రభుత్వమే సేకరించాలని, ప్రభుత్వం మద్దతుధర కోసం నియమించిన అన్ని కమిటీలను రద్దుచేయాలని కూడా రైతు నాయకులు మంత్రిని కోరారు. విద్యుత్ చట్టసవరణ బిల్లు ఉపసంహరణ, లఖింపురి ఖేరీలో రైతులను హతమార్చిన ఘటనపై హోం శాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రాను అరెస్టు చేయాలని తదితర డిమాండ్లను విజ్ఞాపన పత్రంలో పొందుపరచారు. కర్నాటక రైతుల నిర్ణయం బీజేపీకి శరాఘాతం అవుతుంది.

మే, జూన్, జులై నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా స్థాయిల్లో రైతు సదస్సులు ఏర్పాటు చేస్తామని కిసాన్‌మోర్చా తెలిపింది. ఆగస్టు 1న, 15తేదీలలో కార్మిక యూనియన్‌లు కలుపుకుని పెద్దప్రదర్శనలు నిర్వహిస్తామని రైతులు, కార్మికుల ప్రయోజనాలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే విధానానికి అంతం పలకాలని మోర్చా డిమాండ్ చేసింది. సెప్టెంబరులో లేదా నవంబరు మధ్యలో జాతీయస్థాయి రైతు యాత్రలు దేశమంతటా నిర్వహిస్తామని జాతీయస్థాయి కిసాన్‌మోర్చా నాయకుల ఆధ్వర్యంలో ఇవి జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాలలో అసెంబ్లీఎన్నికలు జరుగు తాయని అక్కడ కేంద్రీకరించి పనిచేయాలని నిర్ణయించారు. కర్నాటక ప్రభుత్వం రైతులపట్ల అనుసరించిన వైఖరి ఆందోళనకరంగా ఉంది. పాలకపార్టీ నాయకుల తీరు మరింత ప్రమాదకరమైంది. కులం,మతం ఆధారంగా రైతులనుచీల్చేందుకు పూనుకున్నారు. రాజకీయ ప్రయోజనాల కోసమే ఈ పనిచేస్తున్నారు. ఒక గ్రూపు రైతులను మరో గ్రూపుపైకి పాలకపార్టీ నాయకులు ఉసిగొల్పుతున్నారు. కులం,మతాలను ఉపయోగించుకొని రాజకీయ ప్రయోజనాలు పొందుతున్నారు. అయితే రైతుల కష్టాలను గురించి పాలకులు పట్టించుకోవడంలేదు. 2021లో దేశవ్యాప్తంగా 10,881మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. వీరిలో అత్యధికంగా మహారాష్ట్రలో జరిగాయి. రెండోస్థానంలో కర్నాటక నిలిచింది. ఆహ్వానించదగిన పరిణామం ఏమంటే పశ్చిమబెంగాల్, బిహార్, జార్ఖండ్, ఒడిశాలలో ఒక్కరైతు కూడా ఆత్మహత్యకు పాల్పడలేదు. 2021లో కర్నాటకలో 2082 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. రాష్ట్రంలో అత్యధికంగా బెలగావి ప్రాంతంలో 200 మంది ఆత్మహత్యలు చేసుకోగా, మైసూరు జిల్లాలో 191 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ రైతు కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించే విషయంలోనూ రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ చూపడంలేదు. ఈ నేపథ్యంలో ఈసారి బీజేపీని ఓడించాలని కిసాన్‌మోర్చా సమావేశం ప్రతినబూనింది.

వ్యాపారుల లాబీతో మొక్కజొన్న ధర పతనం!

ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం, పరపీడన పరాయణత్వం తప్ప అన్నాడు శ్రీశ్రీ. ఆయన మాటల్లోనే భారత రైతుల జీవితంలో ఏమున్నది గర్వించ దగ్గది. పంట నష్టాలు, అప్పులు, ఆత్మహత్యలు తప్ప. ఇది దేశ రైతాంగ చిత్రపటం. మొక్కజొన్న ప్రపంచంలోని 165 దేశాల్లో 190 మిలియన్ హెక్టార్ల సాగు చేస్తున్నారు. మొక్కజొన్న అనేక దేశాల్లో ప్రధాన ఆహార పంటగా ఉంది. గోధుమ, బియ్యం కన్నా ఎక్కువగా ఆహారానికి ఉపయోగిస్తున్నారు. ఇథనాల్ తయారీ, పశుగ్రాసం, మొక్కజొన్న పిండి, కార్న్ సిరప్ ఉత్పత్తుల్లో మొక్కజొన్నను ఉపయోగిస్తున్నారు. 2021 అంచనా ప్రకారం మొత్తం ప్రపంచ ఉత్పత్తి కోటి 20 లక్షల టన్నులు. 2022-23 వార్షిక సంవత్సరం అంచనా ప్రకారం భారతదేశంలో మొక్కజొన్న ఉత్పత్తి ప్రాథమిక అంచనా 21.95 మిలియన్ టన్నులు. మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో ఉత్పత్తి పెరిగి కర్నాటకలో తగ్గిన ఉత్పత్తిని భర్తీ చేసింది. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ప్రకారం అత్యధిక మొక్కజొన్న సాగు బిహార్‌లో జరుగుతుంది. ఇక్కడ సంవత్సరానికి రెండు పంటలు పండిస్తారు. 20శాతం భూమిని మొక్కజొన్న పంటలకు రైతాంగం వినియోగిస్తున్నారు. ఆ తర్వాత ఉత్తరప్రదేశ్ 11శాతం, రాజస్థాన్ 10శాతం, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్‌లలో 8శాతం మొక్కజొన్న పండిస్తున్నారు.

ఇతర పంటల రైతుల మాదిరే మొక్కజొన్న పంట సేద్యపు రైతులు కూడా తీవ్రసంక్షోభాన్ని ఎదుర్కొం టున్నారు. మొక్కజొన్న సాగు మొదలు గాక ముందు ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో రబీలో వరితో పాటు మినుము, పెసర, మాగాణి సాగుగా ఉంటే, వేరుశనగ, కంది, మొక్కజొన్న మెట్ట భూమిలో సాగు చేసేవారు. రబీ వరి సాగుకి అనేక ప్రాంతాల్లో సాగు నీరు ఇవ్వటానికి ప్రభుత్వం నిరాకరించటం, ఖరీఫ్‌కు ఆగస్టు దాకా గత ప్రభుత్వాలు సాగునీరు విడుదల చేయకపోవటం, అపరాల సాగుకి సమయం లేకపోవటం, మినుము, పెసర పైర్లకు విపరీతంగా తెగుళ్లు వ్యాపించటంతో రైతాంగం ప్రత్యామ్నాయ పంటల ఆలోచనచేసి మొక్కజొన్న పంటను ఎంచుకున్నారు. ప్రారంభంలో ఈ పంట గుంటూరు, కృష్ణా జిల్లాలో పరిమితమైంది. ఆ తర్వాత రాష్ట్ర మంతటా విస్తరించింది. ఈ పంటతో పాటు జొన్న పంట కూడా రబీ సేద్యంలోకి వచ్చి మరో ముఖ్య పంటగా నిలిచింది.

ప్రారంభంలో మొక్కజొన్న రైతులకు ఆశాజనకంగా ఉంది. వరి కన్నా ఎక్కువ ఆదాయం వచ్చింది. కొద్ది సంవత్సరాలు ఇలా కొనసాగిన తర్వాత మొక్కజొన్న రైతాంగానికి సంక్షోభం ప్రారంభమైంది. ప్రకృతి వైపరీత్యాలు మొక్కజొన్న పంటను చుట్టుముట్టాయి. ప్రభుత్వం ప్రకటిస్తున్న మద్దతు ధరలు రైతుల ప్రయోజనాలను కాపాడటంలో విఫలమైనాయి. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు ఇలా ఉన్నాయి. 2014-15 సంవత్సరంలో క్వింటాల్‌కు 1310 రూపాయలు. సేద్యపు ఖర్చులు ఎకరాకి 25 వేలు. సగటు దిగుబడి ఎకరాకి 25 క్వింటాళ్లు. చాలా మంది రైతులకు ఈ దిగుబడి కూడా రావటంలేదు. 25 క్వింటాళ్లు వచ్చే రైతుకు కూడా మిగిలేది చాలా తక్కువ. కౌలు రైతులకు పెట్టుబడి కూడా రాని పరిస్థితి. గత కొద్ది రోజులుగా కురిసిన భారీ వర్షాలకు మొక్కజొన్న పంటకు తీవ్ర నష్టం జరిగి రైతాంగం నష్ట పోయారు. 2020-21లో 1850, 2021-22లో 1870, 2022-23లో1963 రూపాయలు క్వింటాల్ మొక్కజొన్నకు ప్రభుత్వం మద్దతు ధరలుగా ప్రకటించింది. పంట ఖర్చులు 35వేలకు పైగా పెరిగాయి.

మార్కెట్లో మొక్కజొన్న కొనటానికి వ్యాపారులు ముందుకు రాలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతు ధర చెల్లించి రైతుల నుండి నామ మాత్రంగానే కొనుగోలు చేసి బాధ్యత తీరినట్లుగా వ్యవహరించాయి. రైతుల వద్ద నిల్వలు పేరుకుపోయాయి. అయినకాడికి అమ్ముకుందామన్నా కొనే నాధుడు కన్పించలేదు. రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.

2022లో అంతర్జాతీయంగాను, దేశీయంగాను మొక్కజొన్న దిగుబడులు తగ్గటం, ఎగుమతి ఆర్డర్లు ఎక్కువగా ఉండటం వలన వ్యాపారులు క్వింటాల్‌కు 2000 నుంచి 2200 రూపాయల ధర వరకు రైతుల నుంచి కొనుగోలు చేశారు. తెలుగు రాష్ట్రాల్లో 2023 మార్చివరకు రైతులకు ఆ ధర లభించింది. ఈ సంవత్సరం కొత్తపంట చేతికి రావటం ప్రారంభం కావటం, ఉత్పత్తి గతం కన్నా పెరగటంతో అకస్మాత్తుగా వ్యాపారులు ధరను దారుణంగా తగ్గించారు. 16 వందల నుంచి 1850 రూపాయల లోపు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. నెలలోపే నాలుగు వందలకుపైగా తగ్గింది. బిహార్‌లోని భాగపూర్ జిల్లాలో క్వింటాల్‌కు 1050 రూపాయలుమాత్రమే రైతులకు లభిస్తున్నది. క్వింటా మొక్కజొన్న పండించ టానికి 1300 రూపాయల దాకా ఖర్చు అవుతుంది.

దేశంలో మొక్కజొన్న రైతులు న్యాయమైన ధర కోసం ఆందోళన చేస్తుంటే, మద్దతు ధరకు కొనుగోలుచేసే చర్యలు తీసుకోకుండా 50 లక్షల టన్నుల మొక్కజొన్నను దిగుమతి చేసుకోవాలని మోదీ ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు దిగుమతి సుంకాన్ని 50శాతం నుండి 15శాతం తగ్గించింది. ఫలితంగా మొక్కజొన్న ధర మరింత పతనమై రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. దేశంలో తగినంత ఉత్పత్తి జరిగినప్పుడు దిగుమతి సుంకం తగ్గించి మరీ దిగుమతి చేసుకోవాల్సిన అవసరం ఏమొచ్చింది. తెలుగు రాష్ట్రాల్లో ఇంతవరకు సేకరణ ప్రారంభంకాలేదు.

2007లో పత్తి ధర క్వింటాల్ 6నుండి 7వేలకు పెరిగి రైతాంగానికి మిగులు ఏర్పడింది. అలాంటి సందర్భంలో కేంద్ర ప్రభుత్వం ఎగుమతులను నిలిపి వేయాలని నిర్ణయించింది. ఫలితంగా రెండు రోజుల్లో పత్తి ధర 4వేలకు పడిపోయింది. గత మార్చి దాకా 2200రూపాయల ధర మొక్కజొన్నకు లభించి రైతాంగానికి ఊరటగా ఉన్న సమయంలో ధర తగ్గటమే కాకుండా, దిగుమతి చేసుకోవాలనే నిర్ణయం మూలంగా ధర పతనం ఎక్కడికి చేరుతుందోనని రైతాంగం ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ నిర్ణయం రైతాంగ వ్యతిరేక విధానాలకు నిదర్శనం. సాంప్రదాయ సరఫరాదారు అర్జెంటీనాలో ఏర్పడిన తీవ్రమైన కరువు మొక్కజొన్న ఉత్పత్తి తగ్గిన ఫలితంగా ఆసియాలోని ఫీడ్ మిల్లర్లు భారతదేశం నుండి మొక్కజొన్న కొనుగోలు చేయటానికి ఇద్దరు వ్యాపారులు వచ్చారు. ఇలాంటి పరిస్థితుల్లో మొక్కజొన్న రైతాంగానికి మంచి ధర వచ్చేలా చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది. అందుకు భిన్నంగా రైతాంగం నష్టపోయే నిర్ణయం తీసుకుంది.

అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాలు మొక్కజొన్న రైతులకు పెద్ద మొత్తంలో సబ్సిడీలు ఇస్తున్నాయి. అమెరికా అయితే 1930 నుంచి సబ్సిడీ ఇస్తున్నది. 1995 నుండి 2014 వరకు మొక్కజొన్న రైతులకు అమెరికా సంవత్సరానికి 4.7 బిలియన్ల డాలర్లను అందించింది. ఆ తర్వాత వ్యవసాయం, ఆహార కార్యక్రమాలపై సంవత్సరానికి 97.29 బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తున్నది. మోదీ ప్రభుత్వం మాత్రం నామ మాత్రంగా ఇస్తున్న సబ్సిడీలను తగ్గిస్తూ వస్తున్నది.

బొల్లిముంత సాంబశివరావు,
సెల్: 9885983526

సిద్ధరామయ్య వైపు మొగ్గు

- తర్వాత స్థానాల్లో బొమ్మై, కుమారస్వామి, డీకే
- కర్ణాటక సీఎం అభ్యర్థిపై ఎన్డీటీవీ సర్వే వెల్లడి

న్యూఢిల్లీ: కర్నాటక రాష్ట్రంలో ఎన్నికల వేడి పెరుగుతోంది. ప్రధాన పార్టీలు జోరుగా ప్రచారం చేస్తున్నాయి. ఈనెల 10న అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ జరగనుండగా అ తర్వాత మూడ్రోజుల్లో ఫలితాలు వెలువడతాయి. ఈ పరిస్థితుల్లో ప్రజానాడిని తెలుసుకునే ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. ప్రజాభిప్రాయ సేకరణకు పోల్స్ జరుగుతున్నాయి. ఇదే క్రమంలో ప్రముఖ వార్తాసంస్థ ఎన్డీటీవీ, లోక్‌నీతి-సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్ (సీఎస్‌డీఎస్)తో కలిసి పబ్లిక్ ఒపీనియన్ సర్వే నిర్వహించింది. ఇందులో ముఖ్యమంత్రిగా కన్నడీగుల మొదటి ఎంపిక సిద్దరామయ్య అని తేలింది. ఆయన తర్వాత ప్రస్తుత సీఎం బొమ్మై, మాజీ సీఎం కుమారస్వామి, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు డీకే శివకుమార్ పేర్లు వినిపించాయి. సిద్దరామయ్యకు వయోవృద్ధుల్లో మంచి పేరున్నది. బొమ్మైకు యువత మద్దతున్నది. జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామి, కాంగ్రెస్ నేత డీకే శివకుమార్‌లనూ సీఎం అభ్యర్థులుగా ఓటర్లు పరిగణనిస్తున్నారు. రాష్ట్రానికి నాలుగు సార్లు ముఖ్యమంత్రి అయినప్పటికీ ఒక్కసారి కూడా పూర్తి పదవీకాలం పనిచేయని బీజేపీ నేత బీఎస్ యడియూరప్ప ఐదవ స్థానంలో నిలిచారు. అవినీతి ఆరోపణల క్రమంలో యడియూరప్ప సీఎం పదవిని కోల్పోయారు. ఆయన స్థానంలో బొమ్మై 2021లో బాధ్యతలు చేపట్టారు. ఇదే నేపథ్యంలో యడియూరప్ప ఈసారి పోటీలో లేరు.

ప్రజలు సీఎం అభ్యర్థిని చూసి ఓటేస్తారా లేక పార్టీనా, స్థానిక అభ్యర్థినా అన్నది తేల్చే ప్రయత్నాన్ని ఎన్డీటీవీ-సీఎస్‌డీఎస్ సర్వే చేసింది. సర్వేలో పాల్గొన్న వారిలో 56శాతం మంది పార్టీకి ప్రాముఖ్యత ఇస్తామని చెప్పగా 38శాతం అభ్యర్థినిబట్టి ఓటేస్తామన్నారని, నాలుగు శాతం మందే ముఖ్యమంత్రి అభ్యర్థిని చూసి ఓటేస్తామని చెప్పారని వెల్లడించింది. క్షేత్రస్థాయిలో బీజేపీ కంటే కాంగ్రెస్‌కే ఓటర్లు మొగ్గు చూపుతున్నారని పేర్కొంది. 59శాతం మంది బీజేపీని కాంగ్రెస్, జేడీఎస్‌కు మించిన అవినీతి పార్టీగా, 'నెపోటిస్టిక్' పార్టీగా పేర్కొన్నట్లు తెలిపింది. కాంగ్రెస్ గురించి 30శాతం, జేడీఎస్ గురించి ఎనిమిది శాతం మంది ఇటువంటి అభిప్రాయాన్ని వ్యక్తంచేశారన్నది. ప్రజాభిప్రాయంలో ఫ్యాక్షనిజంలోనూ అధికార పక్షానిదే పైచేయిగా సర్వే తేల్చింది. 55శాతం బీజేపీని ఫ్యాక్షన్ పార్టీగా పేర్కొన్నారని తెలిపింది.

కర్నాటక అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఉన్నదని, 47శాతం కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉంటే బీజేపీకి 37శాతం, జేడీఎస్‌కు 14శాతం మంది అనుకూలంగా ఉన్నారని వెల్లడించింది. అలాగే మతసామరస్యం విషయంలోనూ కాంగ్రెస్‌నే ప్రజలు ఎంపిక చేశారు. ఆ పార్టీకి అనుకూలంగా 49శాతం మంది ఉన్నారు. కర్నాటక-మహారాష్ట్ర సరిహద్దు వివాదాన్ని పరిష్కరించడంలో బీజేపీకి కాంగ్రెస్‌కు సమానంగా 40శాతం మద్దతున్నది. జేడీఎస్‌కు 14శాతం మంది మద్దతిచ్చారు. ఇక వేర్వేరు కులాలు, వర్గాల వార ఓటింగ్ తీరును ఎన్డీటీవీ సర్వే పరిశీలించింది. వొక్కాలిగా వర్గీయుల ఓట్లు కాంగ్రెస్‌కు (34శాతం), జేడీఎస్ (36శాతం) మధ్య చీలిపోయి ఉండటాన్ని గుర్తించింది. లింగాయత్‌లు మాత్రం బీజేపీ(67శాతం) పక్షాన ఉన్నారని, ముస్లింల (59శాతం) ఓటు కాంగ్రెస్‌కేనని తేల్చింది. కర్నాటకలోని బీజేపీ ప్రభుత్వం ఇటీవల ముస్లింలో వెనుకబడిన వర్గాలకున్న నాలుగు శాతం రిజర్వేషన్‌ను రద్దు చేసి తమ మద్దతుదారులైన లింగాయత్-వొక్కలిగా వర్గీయులకు మళ్లించింది. దీంతో ఆయా వర్గాల కోటాలు ఏడుశాతం -ఆరు శాతం చొప్పున పెరిగాయి.

మామిడిచెట్టుపై కరెన్సీ కట్టలు

బెంగళూరు: అసెంబ్లీ ఎన్నికల వేళ కర్నాటకలో ప్రచారం జోరుగా సాగుతోంది. అధికార బీజేపీ సహా ప్రతిపక్ష పార్టీలు ప్రచారంలో దూసుకుపోతున్నాయి. ఓటర్లను ఆకట్టుకునేందుకు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించాయి. కాగా, ఎన్నికల వేళ భారీ మొత్తంలో నగదు పట్టుబడటం సంచలనంగా మారింది. ఎన్నికల సమయంలో ప్రధాన రాజకీయపార్టీలు ఓటర్లకు పంచడానికి పెద్ద ఎత్తున నగదు సమకూర్చాయన్న సమాచారం మేరకు ఐటీ శాఖ అధికారులు దృష్టి కేంద్రీకరించారు. ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సోదాల్లో భాగంగా కాంగ్రెస్ నేత సుబ్రమణ్య రాయ్ ఇంట్లో భారీ మొత్తంలో నగదు స్వాధీనం చేసుకున్నారు. మైసూర్‌లోని సుబ్రమణ్య రాయ్ ఇంట్లో ఆదాయ పన్ను శాఖ అధికారులు తనిఖీలు చేపట్టగా మామిడి చెట్టుపై బాక్సులు ఉండటం గమనించారు. వాటిని తీసి చూడగా నోట్ల కట్టలు కనిపించాయి. మొత్తం డబ్బును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ కోటి రూపాయలు ఉన్నట్టు వెల్లడించారు. రాయ్ పుత్తూరు కాంగ్రెస్ అభ్యర్థి అశోక్ కుమార్ రాయ్ సోదరుడు. ఇప్పటిదాకా రూ.300 కోట్లకు పైగా లెక్క చూపని డబ్బును ఈసీ స్వాధీనం చేసుకుంది. ఇందులో ఒక్క బెంగళూరులోనే రూ.82 కోట్లు స్వాధీనం చేసుకుంది. అంతకుముందు ఏప్రిల్ 13న బెంగళూరు సిటీ మార్కెట్ ఏరియాలో రూ.కోటిని పోలీసులు జప్తు చేశారు. ఇద్దరు వ్యక్తులు ఆటోలో డబ్బు తీసుకెళుతుండగా పట్టుకున్న పోలీసులు...ఎలాంటి లెక్కలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు.

సమాజ ప్రశాంతత కాంగ్రెస్‌కు నచ్చదు

మోదీ విమర్శలు

బెంగళూరు: కర్నాటక శాసనసభ ఎన్నికల్లో విజయం కోసం హోరాహోరీ యుద్ధం జరుగుతోంది. బీజేపీ విజయం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెమటోడుస్తున్నారు. బుధవారం ఆయన మూడబిద్రి ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతూ కాంగ్రెస్‌పై విమర్శలు కురిపించారు. సమాజంలో ప్రశాంతత ఉంటే కాంగ్రెస్ ప్రశాంతంగా ఉండలేదని మోదీ ఆరోపించారు. దేశం ప్రగతిపథంలో పయనిస్తూ ఉంటే కాంగ్రెస్ సహించలేదని తెలిపారు. ఆ పార్టీ రాజకీయాలు కేవలం 'విభజించు, పాలించు' సూత్రంపైనే ఆధారపడ్డాయని ఎదురుదాడి చేశారు. కాంగ్రెస్ ప్రమాదకర వైఖరికి సాక్ష్యంగా కర్నాటక నిలుస్తుందని చెప్పారు. ఢిల్లీలోని 'షాహీ' కుటుంబానికి సేవ చేయడం కోసం ఏటీఎంగా కర్నాటకను తయారు చేసుకోవాలని కాంగ్రెస్ ఆరాటపడుతోందన్నారు. బీజేపీ మాత్రం కర్నాటకను అభివృద్ధి చేయాలని కోరుకుంటోందని చెప్పారు. అభివృద్ధికి సంబంధించిన అన్ని రంగాల్లోనూ రాష్ట్రం నెంబర్‌వన్‌గా ఉండాలని బీజేపీ కాంక్షిస్తోందన్నారు. రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతామని, ఆధునిక మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేసి, మాన్యుఫ్యాక్చరింగ్ సూపర్ పవర్‌గా తీర్చిదిద్దాలని తాము భావిస్తున్నామని చెప్పారు. కానీ కాంగ్రెస్ మాత్రం పదవీ విరమణ పేరుతో ఓట్లు అడుగుతోందన్నారు. బీజేపీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను రద్దు చేయాలన్నది కాంగ్రెస్ కుట్ర అని ఆరోపించారు.

కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలన కాలంలో కర్నాటక అస్థిరంగా ఉందని, ఆ పార్టీకి ఎస్‌డీపీఐ మద్దతిస్తోందన్నారు. దేశ సైన్యాన్ని ఆ పార్టీ దూషిస్తోందని, అగౌరవపరుస్తోందని చెప్పారు. దేశ వ్యతిరేకశక్తులతో ఆ పార్టీ చేతులు కలుపుతోందన్నారు. కాగా, మోదీ తన ప్రసంగాన్ని భారత్ మాతా కీ జై, బజరంగ్‌బలి కీ జై అనే నినాదాలతో ప్రారంభించారు. కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ కాంగ్రెస్ మేనిఫెస్టోను ప్రస్తావించారు. కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియాని నిషేధించిందని, దీనికి స్పందనగా కాంగ్రెస్ బజరంగ్‌దళ్‌ను నిషేధిస్తామని చెప్తోందని ఎదురుదాడి చేశారు. కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలు చేస్తోందన్నారు.

మరణశిక్ష తగ్గించలేం

రాజోనాకు సుప్రీంలో చుక్కెదురు

న్యూఢిల్లీ: పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి బియాంత్ సింగ్ హత్య కేసులో మరణశిక్ష పడిన బల్వంత్ సింగ్ రాజోనాకు సుప్రీంకోర్టులో ఊరట లభించలేదు. అతడి మరణశిక్షను జీవితఖైదుగా మార్చేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. రాజోనా క్షమాభిక్ష పిటిషన్‌పై సంబంధిత అధికారులు నిర్ణయం తీసుకుంటారని సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. అతడి పిటిషన్‌పై తగిన సమయంలో నిర్ణయం తీసుకోవాలని కేంద్ర హోంశాఖను ఆదేశించింది. సిక్కులకు ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుతూ జరుగుతున్న ఆందోళనల్లో భాగంగా 1995లో చండీగఢ్ సచివాలయం ముందు జరిగిన పేలుడులో అప్పటి పంజాబ్ ముఖ్యమంత్రి బియాంత్ సింగ్‌తో పాటు మరో 16 మంది మరణించారు. ఈ పేలుడులో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బల్వంత్ సింగ్ రాజోనా ప్రమేయం ఉన్నట్లు రుజువు కావడంతో 2007లో అతడికి ప్రత్యేక న్యాయస్థానం మరణశిక్ష విధించింది. 26 ఏళ్లుగా రాజోనా జైలు శిక్ష అనుభవిస్తున్నాడు.

తనకు క్షమాభిక్ష ప్రసాదించాలని కోరుతూ 2012లో రాజోనా కేంద్రాన్ని ఆశ్రయించాడు. అప్పటి నుంచి అతడి పిటిషన్ పెండింగ్‌లో ఉంది. ఈ క్రమంలోనే తన మరణశిక్షను జీవితఖైదుకు తగ్గించాలని కోరుతూ 2020లో రాజోనా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై విచారణ జరుపుతున్న న్యాయస్థానం అనేకమార్లు కేంద్రానికి సూచనలు చేసింది. తాజాగా మరోసారి విచారణ జరిపిన త్రిసభ్య ధర్మాసనం శిక్షను తగ్గించబోమని తేల్చిచెప్పింది.

వొక్కలిగ సామాజిక వర్గంలో హేమాహేమీలు

బెంగళూరు: కర్నాటకలో వొక్కలిగ సామాజికవర్గం బలంగా ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీల గెలుపోటములను నిర్ణయించే శక్తి ఈ సామాజిక వర్గం సొత్తు. కాగా, ఈ సామాజిక వర్గం నుంచి రాజకీయాల్లో చక్రం తిప్పుతున్న ఐదుగురు నాయకులు ప్రముఖంగా ఉన్నారు. వారు ఈనెల 10న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో సత్తాచాటుకునేందుకు శక్తియుక్తులు కేంద్రీకరిస్తున్నారు. వ్యక్తిగత గెలుపునే కాకుండా, పార్టీ గెలుపును కూడా ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. వారి వివరాలను పరిశీలిస్తే...ముందుగా డీకే శివకుమార్. ఆయన వొక్కలిగ సామాజిక వర్గంలో గట్టి పేరున్న నేత. కర్నాటక కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉన్నారు. ఇప్పటి వరకూ ఏడుసార్లు ఆయన ఎమ్మెల్యేగా గెలిచారు. ఈ ఎన్నికల్లో కనకపుర నియోజకవర్గం నుంచి డీకే పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ దిగ్గజ నేతల్లో ఒకరైన డీకే శివకుమార్...2008 నుంచి ఇదే నియోజకవర్గం నుంచి వరుసగా మూడుసార్లు గెలిచారు. ఇక హెచ్‌డీ కుమారస్వామి...ఆయన జేడీఎస్ నేత. కుమారస్వామి రెండుసార్లు కర్నాటక ముఖ్యమంత్రిగా పనిచేశారు. మాజీ ప్రధాని దేవెగౌడ కుమారుడు. దక్షిణ కర్నాటలో బలమైన వొక్కలిక సామాజిక వర్గానికి చెందిన నేత. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో చెన్నపట్న నియోజకవర్గం నుంచి ఆయన పోటీ చేస్తున్నారు. బీజేపీ అభ్యర్థి సీపీ యోగేశ్వర నుంచి ఆయన గట్టి పోటీ ఎదుర్కొంటున్నారు. బీజేపీకి చెందిన బీజేపీ నేత అశోక. ఆయన మంత్రిగా కూడా పనిచేస్తున్నారు. ప్రముఖ వొక్కలిగ నేత అయిన అశోక బెంగళూరులోని పద్మనాభనగర్ నుంచి మరోసారి గెలిచేందుకు పోటీ పడుతున్నారు. అలాగే, జేడీఎస్ పార్టీలో గట్టి పేరున్న నేత హెచ్‌డీ రేవణ్ణ. ఆయన హెచ్‌డీ దేవెగౌడ తనయుడు. హోలెనర్సిపుర నియోజవర్గం నుంచి ఆయన పోటీలో ఉన్నారు. 1994 నుంచి రాజకీయాల్లో కొనసాగుతున్నారు. హోలెనర్సిపుర నుంచి ఆయన గెలుపు, ఓటములను చవిచూశారు. 2004లో తన సోదరుడు కుమారస్వామి ప్రభుత్వంలో మంత్రిగా రేవణ్ణ పనిచేశారు. వొక్కలిగ సామాజిక వర్గానికి చెందిన బలమైన జేడీఎస్ నేతల్లో జీటీ దేవెగౌడ ఒకరు. 2018 ఎన్నికల్లో ఆయన సిట్టింగ్ సీఎం సిద్ధరామయ్యపై చాముండేశ్వరి నియోజకవర్గం నుంచి పోటీ చేసి భారీ ఆధిక్యంతో గెలుపొందారు. చాముండేశ్వరి నియోజకవర్గంలో మొదటి నుంచీ కాంగ్రెస్, జేడీఎస్ మధ్యే పోటీ ఉంటోంది. తొలిసారి ఇక్కడ త్రిముఖ పోటీ నెలకొంది.

హైకోర్టును ఆశ్రయించండి

ది కేరళ స్టోరీపై సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: 'ది కేరళ స్టోరీ' సినిమాలో ఓ ప్రకటనను జారీ చేసేలా ఆదేశించాలని కోరిన పిటిషనర్లకు సుప్రీంకోర్టులో ఉపశమనం దక్కలేదు. 'ఇది యథార్థ కథ కాదు, కేవలం కల్పిత కథ' అని ప్రకటనను ప్రదర్శించాలని పిటిషనర్ కోరారు. దీనిపై కేరళ హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు సర్వోన్నత న్యాయస్థానం బుధవారం సూచించింది. అన్ని కేసులను తానే విచారించడం సాధ్యం కాదని సుప్రీంకోర్టు తెలిపింది. ఈ విషయంపై సాధ్యమైనంత త్వరగా విచారణ జరిపే అంశాన్ని హైకోర్టు పరిశీలిస్తుందని చెప్పింది. 'ది కేరళ స్టోరీ' టీజర్ విడుదలైన తర్వాత పెద్ద ఎత్తున వివాదం జరుగుతోంది. ఈ కథలోని ఓ పాత్ర మాట్లాడుతూ కేరళలో ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాద సంస్థ 32 వేల మంది మహిళలను రిక్రూట్‌చేసుకుందని, తాను వారిలో ఒకరినని చెప్పడం వివాదాస్పదమైంది. ఈ సినిమాపై నిషేధం విధించాలని కేరళ అధికార, ప్రతిపక్షాలు కోరుతున్నాయి. హిందీ సినిమా తమ రాష్ట్రంలో విడుదల కాకూడదని సీపీఎం, కాంగ్రెస్ డిమాండ్ చేస్తున్నాయి. దీనిపై ఈ సినిమా ఎగ్జిబిటర్లు స్పందిస్తూ, ప్రేక్షకులు ఓటీటీలో చూసే అవకాశం ఉందని, అందువల్ల థియేటర్లలోనే ప్రదర్శించడం ఉత్తమమని చెప్తున్నారు. ఈ సినిమా శుక్రవారం విడుదల కాబోతోంది.

సిసోదియా బెయిల్‌పై సీబీఐకి హైకోర్టు నోటీసు

న్యూఢిల్లీ: అస్వస్థతతో తన భార్య ఆసుపత్రిలో ఉన్నందున తనకు తాత్కాలిక బెయిల్ మంజూరు చేయాలని ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోదియా దాఖలు చేసిన పిటిషన్‌పై సీబీఐకి ఢిల్లీ హైకోర్టు బుధవారం నోటీసులు పంపింది. మద్యం పాలసీ కుంభకోణంలో మార్చి 26న సిసోదియాను సీబీఐ అరెస్టు చేయగా, ప్రస్తుతం ఆయన జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నారు. కాగా, సిసోదియా భార్య గతవారం ఆరోగ్యం విషమించడంతో ఢిల్లీలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. సిసోదియా దాఖలు చేసిన రెగ్యులర్ బెయిల్‌పై ఇప్పటికే విచారణ జరుపుతున్న హైకోర్టు...దీనిపై గురువారం వాదనలు వింటామని తెలిపింది. కాగా, బుధవారం కోర్టుకు హాజరైన సిసోదియా తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్ధ అగర్వాల్ తన వాదనలు వినిపించారు. సిసోదియా భార్య మల్టిపుల్ స్క్లిరోసిస్‌తో బాధపడుతూ ఇటీవల ఆసుపత్రిపాలయ్యారని జస్టిస్ దినేశ్ కుమార్ శర్మకు విన్నవించారు. దీనికి ముందు, సిసోదియా దాఖలు చేసుకున్న బెయిల్ దరఖాస్తును రౌస్ అవెన్యూ కోర్టు తోసిపుచ్చింది. సిసోదియాపై ఆరోపణల తీవ్రత, కేసు దర్యాప్తు పురోగతిలో ఉన్న దశలో ఆయనకు బెయిల్ ఇవ్వడం కుదరదని ప్రత్యేక న్యాయమూర్తి ఎంకే నాగ్‌పాల్ పేర్కొన్నారు. కేసులో సిసోదియా పాత్రపై విచారణ ఇంకా పూర్తికాలేదని, సహనిందితుల పాత్రపైనా విచారణ జరుగుతోందని న్యాయమూర్తి అన్నారు.

ముస్లిం కోటా రద్దు దారుణం: స్టాలిన్ ఆగ్రహం

చెన్నై: కర్నాటకలో ముస్లింలకు ప్రభుత్వోద్యోగాలు, విద్యాసంస్థల్లో రిజర్వేషన్లు రద్దు చేయడంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగం ప్రకారం భారత్ లౌకికవాద దేశమని, కర్నాటకలో ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లను రద్దు చేయడం సరికాదని అన్నారు. స్టాలిన్ ప్రతి నెలా నిర్వహించే 'మీలో ఒకడిని' కార్యక్రమంలో మాట్లాడుతూ బీజేపీ విద్వేష అజెండాను దేశంపై రుద్దుతోందని మండిపడ్డారు. మైనారిటీల పట్ల బీజేపీ శత్రుత్వ వైఖరి బయటపడుతోందన్నారు. ఎన్నికల్లో ప్రయోజనం పొందడం కోసమే అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేశారన్నారు.బీజేపీకి సోషల్ మీడియా, కొన్ని న్యూస్ మీడియా సంస్థలు సహకరిస్తున్నాయన్నారు. ముస్లింలపై విషం చిమ్మడం వల్ల హిందువులు సంతృప్తి చెందుతారని బీజేపీ నేతలు నమ్ముతున్నారని, అది నిజం కాదన్నారు. బీజేపీకి ఓటు వేయని అత్యధికుల్లో హిందువులు కూడా ఉన్నారన్నారు. ప్రశాంతత, సోదరభావాలను వారు కోరుకుంటారన్నారు. బీజేపీ ఓ వర్గం ప్రజలపై విద్వేషపూరిత అజెండా రుద్దుతోందని, మెజారిటీ ప్రజల మనోభావాలని ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు. కర్నాటకలోని బీజేపీ ప్రభుత్వం మార్చిలో ముస్లింల రిజర్వేషన్లు రద్దు చేసింది. వారికి ఇస్తున్న నాలుగు శాతం రిజర్వేషన్లను వీరశైవ-లింగాయత్‌లు, వొక్కళిగలకు చెరొక 2 శాతం చొప్పున పంచిపెట్టింది. ఆర్థికంగా బలహీన వర్గాల కేటగిరీలో ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించింది.

పార్టీ శ్రేణులతో శరద్ పవార్

ముంబై: నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) అధ్యక్షుడు శరద్ పవార్ పార్టీ అధ్యక్ష పదవి నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించిన ఒక రోజు తర్వాత బుధవారం ఇక్కడ పార్టీ శ్రేణులు సహా ప్రజలతో రోజువారీ సమావేశాన్ని యథావిధిగానే కొనసాగించారు. 82 ఏళ్ల పవార్ మంగళవారం తాను 1990లో స్థాపించి నాయకత్వం వహించిన ఎన్‌సీపీ అధ్యక్ష పదవి నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. అయితే ప్రజా జీవితం నుంచి మాత్రం రిటైర్ కాబోనని తెలిపారు. ఒక కార్యక్రమంలో ఆయన చేసిన ప్రకటన, పార్టీ కార్యకర్తలు, నాయకులను దిగ్భ్రాంతికి గురిచేసింది. మరాఠా యోధుడు తన నిర్ణయాన్ని పున: పరిశీలించవలసిందిగా చాలా మంది అభ్యర్థించారు. ఎన్‌సీపీ సీనియర్ నేత అజిత్ పవార్ మంగళవారం మాట్లాడుతూ తన మామ తన నిర్ణయంపై ఆలోచించుకోవడానికి రెండు, మూడు రోజుల సమయం పడుతుందని ప్రకటించారు. ఇదిలాఉండగా, శరద్ పవార్ యశ్వంతరావు చవాన్ ప్రతిష్ఠాన్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు యథావిధిగా పార్టీ కార్యకర్తలతో సహా ప్రజలను కలుస్తున్నారని ఎన్‌సీపీ కార్యకర్త ఒకరు బుధవారం తెలిపారు. ముఖ్యంగా 15 రోజుల్లో ఢిల్లీలో ఒకటి, మహారాష్ట్రలో మరొకటి రాజకీయ పేలుళ్లు జరుగుతాయని ఎన్‌సీపీ లోక్‌సభ సభ్యురాలు, పవార్ కుమార్తె సుప్రియా సూలే ప్రకటించిన పక్షం రోజుల తర్వాత మంగళవారం శరద్ పవార్ నుంచి ఈ ప్రకటన వెలువడటం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. పవార్ తన నిర్ణయాన్ని ప్రకటించిన తర్వాత రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలకు చెందిన పార్టీ విభాగం ఆఫీస్ బేరర్లు ఆయన తన నిర్ణయాన్ని పునరాలోచించుకోవాలని డిమాండ్ చేస్తూ వారు తమ పదవులను వదులుకున్నారు. అయితే అజిత్ పవార్ పార్టీ పదవులకు రాజీనామా చేయవద్దని వారిని కోరారు. పూణే జిల్లాకు చెందిన బారామతి ఎన్‌సీపీ అధ్యక్షుడి సొంత పట్టణం. అతను రాజకీయంగా శక్తివంతమైన కుటుంబానికి పర్యాయపదంగా ఉన్న ప్రదేశం అది. పవార్ నిర్ణయం అక్కడి ప్రజల్లో నిరాశను కలిగించింది. 'పవార్ సాబ్ రాజీనామా చేయకూడదు.

ఆయన వల్లే పార్టీ ఉంది. పగ్గాలు వదులుకోకూడదు' అని బారామతిలో విద్యా సంస్థలను నడుపుతున్న జవహర్ షా అన్నారు. శరద్ పవార్ ప్రజల్లోకి వెళ్లడానికి ముందు, గత కొన్ని వారాలుగా రాజకీయ వదంతులకు కేంద్ర బిందువుగా ఉన్న తన మేనల్లుడు అజిత్ పవార్‌తో ఈ నిర్ణయం గురించి చర్చించి ఉండవచ్చని షా తెలిపారు. ఆయన ఒంటరిగా నిర్ణయం తీసుకోరని అన్నారు. బారామతి నివాసి అయిన ప్రశాంత్ కటే మాట్లాడుతూ ఈ వార్తను జీర్ణించుకోవడం స్థానిక ప్రజలకు కష్టమేనని, పవార్ సాబ్ ఇలాంటి నిర్ణయం తీసుకోకుండా ఉండవలసిందని అందరూ అభిప్రాయపడుతున్నారని అన్నారు.

సుప్రియకు జాతీయ బాధ్యతలు

అజిత్‌పవార్‌కు రాష్ట్ర బాధ్యతలు

ఎన్‌సీపీ పగ్గాలపై ఛగన్ భుజబల్ సిఫార్సు

ముంబై: ఎన్‌సీపీ అధ్యక్ష పదవికి శరద్ పవార్ రాజీనామా చేయడంతో వారసుల ఎంపిక ప్రచారంలోకి వచ్చింది. పవార్ కుమార్తె సుప్రియా సూలే, సమీప బంధువు అజిత్‌పవార్ పేర్లు తెరపైకి వచ్చాయి. వీరి పేర్లను పార్టీ సీనియర్ నేత ఛగన్ భుజ్‌బల్ సిఫార్సు చేశారు.

పార్లమెంట్ సభ్యురాలు సుప్రియాను పార్టీ జాతీయ అధ్యక్షురాలిగా నియమించాలని, అదే సమయంలో రాష్ట్ర బాధ్యతలను అజిత్ పవార్‌కు కట్టబెట్టాలని ఆయన సూచించారు. శరద్ పవార్ పదవి వీడిన ఒక రోజు తర్వాత ఈ పరిణామాలు చోటుచేసుకొన్నాయి. నాయకత్వ ఎంపికకు ఎన్‌సీపీ ఓ కమిటీని ఏర్పాటు చేసింది. దీనిలో ఛగన్ భుజబల్ సభ్యుడు. ఈ సందర్భంగా భుజ్‌బల్ మాట్లాడుతూ శరద్ పవార్ రాజీనామా విరమించుకోవాలని తాము కోరుకుంటున్నామని, కానీ, ఆయన తన నిర్ణయానికి కట్టుబడి ఉన్నారని చెప్పారు.

దీంతో సుప్రియాకు జాతీయ బాధ్యతలు అప్పగించి.. అజిత్ పవార్‌కు రాష్ట్ర బాధ్యతలు కట్టబెట్టాలని తాను వ్యక్తిగతంగా భావిస్తున్నానని చెప్పారు. బుధవారం ఉదయం బాంద్రాలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయం వెల్లడించారు. పార్టీ నాయకత్వం ఎంపిక కమిటీలో ప్రఫుల్ పటేల్, సునీల్ తాట్కరే, కేకే శర్మ, పీసీ చాకో, అజిత్ పవార్, జయంత్ పాటిల్, సుప్రియా సూలే, ఛగన్ భుజబల్, దిలీప్ వాల్సే పాటిల్, అనిల్ దేశ్‌ముఖ్, రాజేశ్ తోపే, జితేంద్ర అవధ్, హసన్ ముష్రిఫ్, ధనంజయ్ ముండే, జయదేవ్ గైక్వాడ్ ఉండాలని నిన్న శరద్‌పవార్ సూచించారు.

పవార్ నిర్ణయానికి నిరసనగా ఎన్‌సీపీకి జితేంద్ర రాజీనామా

అదే దారిలో మరికొంతమంది

ముంబై: నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) ఎమ్మెల్యే జితేంద్ర అవద్ బుధవారం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేశారు. శరద్ పవార్ ఎన్‌సీపీ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన ఒకరోజు తర్వాత అవద్ ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే తన సహచరుడు అనిల్ పాటిల్ కూడా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు ముందుకొచ్చారు. కానీ వారి రాజీనామాలను ఇప్పటి వరకు ఆమోదించలేదు. థానే నగరంలోని ముంబ్రా-కల్వా నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి, ఎమ్మెల్యే అయిన అవద్... శరద్ పవార్‌కు సన్నిహితుడు, మహారాష్ట్రలో ఎన్‌సీపీ అత్యంత ప్రభావవంతమైన నాయకులలో ఒకరిగా పరిగణించబడుతున్నారు. 2019లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్, శివసేనతో మహా వికాస్ అఘాడి కూటమిని ఏర్పాటు చేయడంలో కూడా ఆయన కీలక పాత్ర పోషించారు. జితేంద్ర అవ్హద్ విలేకరులతో మాట్లాడుతూ 'నేను పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేశాను. ఎన్‌సీపీ అధ్యక్షుడు శరద్ పవార్‌కి నా రాజీనామాను పంపాను. ఎన్‌సీపీ థానే విభాగానికి చెందిన ఆఫీసు బేరర్లు అందరూ రాజీనామా చేశారు' అని తెలిపారు. అయితే ఎన్‌సీపీ మహారాష్ట్ర అధ్యక్షుడు జయంత్ పాటిల్ మాత్రం తన ఏ పదవికి రాజీనామా చేయలేదు. కాగా పార్టీ ఎమ్మెల్యే అనిల్ పాటిల్ మాట్లాడుతూ 'రాజ్యసభ పదవీ కాలం ముగిసే వరకు లేదా లోక్‌సభ ఎన్నికల వరకు కనీసం అధ్యక్షుడిగా కొనసాగాలని మేము అతనిని (శరద్ పవార్) అభ్యర్థిస్తున్నాము. శరద్ పవార్ ప్రతి ఒక్కరి మాట వింటున్నారు. కానీ ఇంకా స్పందించడం లేదు' అని తెలిపారు. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం, షోలాపూర్ జిల్లాకు చెందిన భూషణ్ బాఘెల్ అనే పార్టీ కార్యకర్త తన రాజీనామాను ఉపసంహరించుకోవాలని పవార్‌ను అభ్యర్థిస్తూ రక్తంతో రాసిన లేఖను కూడా పంపాడు. సోనియా గాంధీ విదేశీ మూలం సమస్యపై కాంగ్రెస్ నుంచి విడిపోయి 1999లో ఎన్‌సీపీని స్థాపించిన పవార్, కొత్త నాయకత్వానికి మార్గం చూపాలని కోరుతూ పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తూ మంగళవారం తన నిర్ణయాన్ని ప్రకటించారు.

కుప్పకూలిన బహుదా వంతెన

- నదిలో పడిపోయిన గ్రానైట్ లారీ
- తప్పిన ప్రాణనష్టం

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం: శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో బహుదా నదిపై ఉన్న వంతెన కుప్పకూలింది. బుధవారం ఉదయం 5 గంటల సమయంలో గ్రానైట్ రాళ్ల లోడుతో ట్రైలర్ లారీ వెళుతుండగా ఒక్కసారిగా వంతెన కూలింది. వివరాల్లోకి వెళితే... ఒడిశాలో అస్కా నుంచి ఆంధ్ర ప్రదేశ్‌లోని ఒంగోలుకు 22 చక్రాల ట్రైలర్ ఏపీ 27 యు.బి 2304లో 70 టన్నుల గ్రానైట్ రాయిని తరలిస్తున్నారు. పట్టణంలో భారీ ఎత్తున గ్రామదేవత శ్రీ స్వేచ్ఛావతి సంబరాల నేపథ్యంలో పురుషోత్తపురం వద్ద పోలీస్ అవుట్‌పోస్టు ఉన్నప్పటికీ సదరు వాహనం బరువు పరిమితికి మించిన లోడుతో ఆంధ్రాలోకి ప్రవేశించేసింది. పట్టణం గుండా నది బ్రిడ్జి పైకి వాహనం ముందు భాగం చేరుకున్నాక లోడు ఉండే భాగం బ్రిడ్జి ఎక్కగానే పట్టుతప్పి వంతెన కూలిపోయింది. భారీ బరువుతో వచ్చే వాహనాలు సాధారణంగా పక్కనే ఉన్న జాతీయ రహదారిపై నుంచి వెళుతుంటాయి. కానీ గ్రానైట్ లోడుతో వెళుతున్న లారీ మాత్రం ఇచ్ఛాపురం పట్టణం మీదుగా వచ్చింది. ఈ క్రమంలో బహుదా నది వద్దకు చేరుకోగానే వంతెన ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో లారీ కిందికి నదిలోకి జారిపోయింది. నదిలో నీరు లేకపోవడం... ప్రమాదం జరిగిన సమయంలో వంతెనపై ఇతర వాహనాల రాకపోకలు జరగకపోవడంతో ప్రాణ నష్టం జరగలేదు. లారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వంతెన కూలిన విషయం తెలుసుకున్న ఆర్డీఓ సీతారామ్మూర్తి హుటాహుటిన సంఘటనా స్థలాన్ని తహసిల్దార్ ఎస్.గురుప్రసాద్, ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి సందర్శించారు. క్షేత్ర స్థాయి నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ తన అనుచరులతో కూలిన వంతెనను పరిశీలించారు. రాకపోకలు తక్షణం పునరుద్ధరించే చర్యలతో పాటు కొత్త వంతెన నిర్మాణంతో శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు పార్టీ కార్యకర్తలతో సంఘటనా స్థలానికి చేరుకుని అక్రమ ఇసుక రవాణా, అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఈ దుస్థితి ఏర్పడిందని, ఇప్పటికైనా పరిస్థితులు చక్కదిద్దాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. రూరల్ ఎస్ఐ రమేష్ అధ్వర్యంలో సిబ్బంది వంతెన వద్ద ట్రాఫిక్‌ను నియంత్రించి, జాతీయ రహదారి గుండా పట్టణంలోకి వాహనాల రాకపోకలను బెల్లుపడా మీదుగా మళ్లించారు. బహుదా నదిపై ఈ వంతెనను 1929లో అప్పటి బ్రిటీష్ పాలనలో నిర్మించారు. ఎప్పటి నుంచో వంతెన బలహీనంగా మారుతున్నా పాలకులు పట్టించుకోలేదన్న విమర్శలు వస్తున్నాయి.

సిట్‌పై స్టే ఎత్తివేత

- దర్యాప్తును ప్రాథమిక దశలో అడ్డుకోవడం సరికాదు
- కేసు అపరిపక్వ దశలో హైకోర్టు జోక్యం: సుప్రీం
- జగన్ సర్కారుకు ఊరట

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గత ప్రభుత్వ నిర్ణయాలను సమీక్షించేందుకు వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'సిట్'పై సుప్రీంకోర్టు బుధవారం కీలక తీర్పు వెలువరించింది. సిట్‌పై స్టే విధిస్తూ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ కేసును మెరిట్ ప్రాతిపదికన విచారించి తుది నిర్ణయం వెలువరించాలని హైకోర్టుకు సుప్రీం సూచించింది. హైకోర్టు ఈ కేసు అపరిపక్వస్థాయిలో జోక్యం చేసుకొని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిందని పేర్కొంది. సిట్ దర్యాప్తును ప్రాథమిక దశలోనే అడ్డుకోవడం సరికాదని పేర్కొంది. అందువల్లనే హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను తోసిపుచ్చుతున్నామని వెల్లడించింది. సుప్రీంకోర్టు వ్యక్తం చేసిన అభిప్రాయాలతో సంబంధం లేకుండా మెరిట్స్ ప్రాతిపదికన ఈ కేసును విచారించి తుది నిర్ణయం వెలువరించాలని హైకోర్టుకు సూచించింది. జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ ఎంఎం సుందరేశ్ ధర్మాసనం తీర్పును వెలువరించింది. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో పెద్దఎత్తున ఆర్థిక అవతవకలు చోటుచేసుకున్నాయని, రాజధాని పేరుతో భారీ కుంభకోణం జరిగిందని వైసీపీ ప్రభుత్వం అభిప్రాయపడింది. వీటన్నింటిపై దర్యాప్తు కోసం 'సిట్' ఏర్పాటు చేసింది. సిట్ ఏర్పాటును ఏపీ హైకోర్టులో టీడీపీ నేతలు వర్ల రామయ్య, ఆలపాటి రాజా తదితరులు సవాల్ చేశారు. దీంతో సిట్‌పై ఏపీ హైకోర్టు స్టే ఇచ్చింది. హైకోర్టు నిర్ణయాన్ని సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వం సవాల్ చేస్తూ స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన సుప్రీం స్టేను ఎత్తివేస్తూ రాష్ట్ర ప్రభుత్వ దర్యాప్తునకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

హెచ్ఎంఏతో సాంకేతిక విద్యా శాఖ ఎంవోయూ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పాలిటెక్నిక్ విద్యను పారిశ్రామిక రంగానికి మరింతగా అనుసంధానం చేసి విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తును అందించే క్రమంలో హెచ్ఎల్ మండో ఆనంద్ ఇండియాతో రాష్ట్ర ప్రభుత్వ సాంకేతిక విద్యా శాఖ బుధవారం అవగాహనా ఒప్పందం చేసుకుంది. హెచ్ఎల్ మండో ఆనంద్ ఇండియా ప్రతినిధులతో సాంకేతిక విద్యాశాఖ కార్యాలయంలో అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. కాంచీపురం కేంద్రంగా ఆటోమొబైల్ రంగంలో కీలక భూమిక పోషిస్తూ బ్రేక్‌ల తయారీ, సరఫరాలో ఈ సంస్థ అగ్రగామిగా ఉంది. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణా మండలి చైర్మన్ చదలవాడ నాగరాణి, హెచ్ఎంఏ గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.సారథి ఎంవోయూపై సంతకాలు చేసి పరస్పరం మార్చుకున్నారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ డిప్లొమా విద్యార్థులకు పారిశ్రామిక శిక్షణ, ఉద్యోగ నియామకాలు, పారిశ్రామిక సంస్థల సందర్శన, అతిథి ఉపన్యాసాలు, పాలిటెక్నిక్ పాఠ్యాంశాల రూపకల్పనలో పరిశ్రమల పాత్ర వంటి అంశాలలో మరింత సమన్వయం సాధించేలా ఈ ఒప్పందం ఉంటుందన్నారు. రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలను ఈ ఒప్పందం ద్వారా మరింత బలోపేతం చేసుకునేందుకు ఉపకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక విద్యా శాఖ సంయుక్త సంచాలకులు వి.పద్మారావు, ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ విభాగపు డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.ఎ.వి.రామకృష్ణ, హెచ్ఎల్ మండో ఆనంద్ గ్రూప్ నుంచి మానవ వనరులు విభాగపు డీజీఎం రాజశేఖర్ కంచర్ల, మేనేజర్ రాగిణి శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

దేశానికి తలమానికం విశాఖి

విశాఖలో డేటా సెంటర్‌కు సీఎం జగన్ శంకుస్థాపన

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖపట్నం డేటా కేంద్రం దేశానికి తలమానికం కానుందని ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి వెల్లడించారు. బుధవారం మధురవాడలోని హిల్ నంబర్ 4లో 190 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ డేటా సెంటర్, టెక్నాలజీ బిజినెస్ పార్క్, అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్‌కు రాజేశ్ అదానీ, కరణ్ అదానీలతో కలసి జగన్ శంకుస్థాపన చేశారు. సీఎం జగన్ మాట్లాడుతూ విశాఖపట్నంలో 300 మెగావాట్ల ఇంటిగ్రేటెడ్ డేటా సెంటర్, టెక్నాలజీ బిజినెస్ పార్క్ శంకుస్థాపన చేయడం శుభపరిణామమన్నారు. సింగపూర్ నుండి సబ్ మెరైన్ కేబుల్‌ను విశాఖపట్నం తీసుకువచ్చే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. డేటాసెంటర్, బిజినెస్ పార్క్, స్కిల్ డెవలప్‌మెంట్, రిక్రియేషన్ సెంటర్లు పెట్టడం వలన విశాఖలో దాదాపు 40 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అదానీ గ్రూపు 22 వేల కోట్ల రూపాయలు పెట్టుబడితో విశాఖలో ఐటీని అభివృద్ధి చేయడానికి గట్టిగా ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు.

జగన్ ఓ విజనరీ: రాజేశ్ అదానీ

విశాఖపట్టణంలో పుష్కలమైన అవకాశాలు ఉన్నాయని, సాంకేతిక రంగానికి, డేటా సెంటర్ల ఏర్పాటుకు విశాఖపట్టణం ప్రపంచస్థాయి వేదిక కానుందని అదానీ గ్రూప్ సంస్థల నిర్వాహకుడు రాజేశ్ అదానీ అన్నారు. రాష్ట్రంలో పుష్కలమైన సహజవనరులు ఉన్నాయని, వాటి ఆధారంగా వ్యాపార కార్యకలాపాలు విస్తరించటం, ఉపాధి అవకాశాలు సృష్టి చేయవచ్చాన్నారు. ముఖ్య మంత్రి గొప్ప దార్శనికుడని, ఆయన దేశానికే ఒక బహుమానమని రాజేశ్ అదానీ కితాబిచ్చారు. తమ సంస్థ ద్వారా రాష్ట్రంలో సాగిస్తున్న కార్యకలాపాల గురించి వివరించారు. సీఎం జగన్ అందిస్తున్న సేవలను ప్రస్తావించారు. విశాఖపట్టణం కేంద్రంగా ఏర్పాటు చేస్తున్న ఈ డేటా సెంటర్, టెక్నాలజీ బిజినెస్ సెంటర్ 20 వేల కోట్లు పెట్టుబడి పెడుతున్నామని, 20 వేల మందికి ప్రత్యక్ష ఉపాధి, మరొక 20వేల మందికి పరోక్ష ఉపాధి కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఇవే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో అనేక రంగాల్లో కార్యకలా పాలు సాగిస్తున్నామని గుర్తు చేశారు. కృష్ణపట్నం, గంగవరం పోర్టులను నిర్వహిస్తున్నామని గుర్తు చేశారు. సీఎం జగన్ ఏ విషయంలోనూ రాజీ పడరని, సంక్షేమం విషయంలో అసలు రాజీ పడరని కితాబిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందుతున్న సహాయ, సహకారాలను గుర్తు చేసుకుంటూ రాజేశ్ అదానీ కృతజ్ఞతలు తెలిపారు. కరణ్ అదానీ, ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి, జిల్లా పరిషత్ అధ్యక్షుడు జె.సుభద్ర, పార్లమెంటు సభ్యులు ఎంవీవీ సత్యనారాయణ, ఐటీ పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికల్ వలవన్, ఐటీ శాఖ కార్యదర్శి కోన శశిధర్, ఐటీ పరిశ్రమల శాఖ కమిషనర్ ప్రవీణ్ కుమార్, జిల్లా కలెక్టర్ డా. ఎ.మల్లికార్జున, జీవీయంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, శాసనమండలి సభ్యులు వరుదు కళ్యాణి, వంశీకృష్ణ, శ్రీనివాస యాదవ్, శాసనసభ్యులు అదీప్ రాజ్, భాగ్యలక్ష్మి, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు, ఎస్టీ కమిషనర్ చైర్మన్ కుంబా రవిబాబు, డిప్యూటీ మేయర్లు జీయన్ శ్రీధర్, కె.సతీశ్ కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, అధికారులు పాల్గొన్నారు.

ఆర్-5 జోన్‌పై విచారణ పూర్తి

తీర్పు రిజర్వ్-రేపు ఉత్తర్వులు ఇస్తామని హైకోర్టు వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో నివసించే పేదలకు అమరావతి రాజధానిలో ఇళ్ల స్థలాలు కేటాయించే ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్-5 జోన్ అంశంపై హైకోర్టులో బుధవారం వాదనలు ముగిశాయి. అమరావతి రైతులు, ప్రభుత్వం తరపున వాదనలు విన్న ధర్మాసనం ఈ అంశంపై తీర్పును రిజర్వులో ఉంచింది. దీనిపై శుక్రవారం తుది ఉత్తర్వులు ఇస్తామని వెల్లడించింది. రాష్ట్రంలో ఏ ప్రాంతానికి చెందిన పేదలకైనా రాజధాని అమరావతిలో 1134 ఎకరాల్లో ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గుంటూరు (550.65ఎకరాలు), ఎన్టీఆర్ (583.93 ఎకరాలు) జిల్లా కలెక్టర్లకు భూబదలాయింపు నిమిత్తం సీఆర్‌డీఏ కమిషనర్‌కు అనుమతిస్తూ పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి ఈ ఏడాది మార్చి 31న జీవో 45 జారీచేశారు. ఆ జీవోను సవాలు చేస్తూ రాజధాని ప్రాంత రైతులు యు.శివయ్య, కె.రాజేశ్, బెజవాడ రమేశ్‌బాబు, ఆలూరి రాజేశ్, కుర్రా బ్రహ్మా, కట్టా రాజేంద్రవరప్రసాద్ హైకోర్టులో వేర్వేరుగా వ్యాజ్యాలు దాఖలు చేశారు. ఆయా పిటిషన్లపై ఉన్నత న్యాయస్థానం మంగళ, బుధవారాల్లో విచారణ చేపట్టి తీర్పును రిజర్వ్ చేసింది.

హాస్య నటుడు మనోబాల కన్నుమూత

చెన్నై: తమిళనాడుకు చెందిన ప్రముఖ హాస్య నటుడు, దర్శకుడు మనోబాల (69) కన్నుమూశారు. కొంతకాలంగా కాలేయ సంబంధిత అనారోగ్య సమస్యతో బాధపడుతున్న ఆయన రెండు వారాలుగా చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తుదిశ్వాస విడిచారు. మనోబాల మృతి తమిళ సినీ పరిశ్రమను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. నటుడు, దర్శకుడు, నిర్మాతగా రాణించిన మనోబాల తెలుగు ప్రేక్షకులకూ సుపరిచితమే. ఆయన నటించిన తమిళ సినిమాలు డబ్బింగ్ అవడంతో తెలుగు అభిమానులకు చేరువయ్యారు. ఇక తెలుగులో ఆయన మహానటి, దేవదాసు, రాజ్‌దూత్, వాల్తేరు వీరయ్య వంటి చిత్రాల్లో నటించి మెప్పించారు. చిరంజీవి నటించిన వాల్తేరు వీరయ్య చిత్రంలో న్యాయమూర్తిగా కనిపించారు. 1970ల్లో సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టిన మనోబాల... 1979లో భారతీరాజా వద్ద సహాయ దర్శకుడిగా మారారు. ఆ తర్వాత దర్శకుడిగానూ 20కి పైగా చిత్రాలను తెరకెక్కించారు. మూడు చిత్రాలకు నిర్మాతగా వ్యవహరించారు. దాదాపు 350 సినిమాల్లో సహాయ నటుడిగా మెప్పించారు. దిగ్గజ నటులు కమల్ హాసన్, రజనీకాంత్ చిత్రాల్లో హాస్యనటుడిగా ప్రేక్షకులను అలరించారు. అనేక సీరియళ్లలోనూ నటించి బుల్లితెర ప్రేక్షకులకు చేరువయ్యారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ టోర్నీలో
ఏపీ పురుషుల జట్టుకు కాంస్య పతకం

విశాలాంధ్ర-రాప్తాడు: గోవాలోని పనాజీలో ఏప్రిల్ 30 నుంచి ఈనెల 3 వరకు జరిగిన జాతీయ పురుషుల సాఫ్ట్‌బాల్ ఫెడరేషన్ టోర్నీలో ఏపీ పురుషుల జట్టు అత్యద్భుతమైన ప్రతిభ కనబరచి కాంస్య పతకం సాధించింది. టోర్నీలో మొత్తం 8 జట్లు పాల్గొనగా ఏపీ జట్టు తృతీయ స్థానం కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గోవా యువజన, క్రీడల ప్రిన్సిపల్ సెక్రటరీ మౌనిక, జాతీయ సాఫ్ట్‌బాల్ ఫెడరేషన్ అసోసియేషన్ అధ్యక్షులు నీతల్ నారంగ్, జాతీయ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఎల్.ఆర్.మౌర్య, ట్రెజరర్ శ్రీకాంత్ తోరాట్, సాఫ్ట్‌బాల్ అసోసి యేషన్ ఇండియా సీఈఓ ప్రవీణ్ అనౌకర్ హాజరయ్యారు. ముఖ్య అతిథి, గోవా యువజన, క్రీడల ప్రిన్సిపల్ సెక్రటరీ మౌనిక మాట్లాడుతూ ఇటీవల ఏపీ రాష్ట్రం సాఫ్ట్‌బాల్ క్రీడలో అద్భుతాలు సృష్టిస్తోందని, అనతి కాలంలోనే జాతీయ స్థాయిలో అంచలంచెలుగా ఎదుగుతూ సాఫ్ట్‌బాల్ అంటేనే ఏపీ అన్న రీతిలో రాణిస్తోందన్నారు. ఆంధ్ర ప్రదేశ్ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సీఈఓ వెంకటేశులుతో పాటు ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సీఈఓ సి.వెంకటేశులు ధన్యవాదాలు తెలుపుతూ, వచ్చే ఏడాది జాతీయ క్రీడలు గోవాలో జరుగుతాయని, ఈ పోటీలకు సాఫ్ట్‌బాల్ పురుషుల, మహిళల జట్లు అర్హత సాధించాయని, ఏపీ రాష్ట్రం చక్కటి ప్రతిభ కనబరిచి పతకం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్య అతిథుల చేతుల మీదుగా ఆంధ్ర ప్రదేశ్ సాఫ్ట్‌బాల్ పురుషుల జట్టుకు మెడల్‌తో పాటు కప్పును అందజేశారు.

ఉద్యమం అణచివేతకు కేంద్రమంత్రి కుట్ర

రెజ్లర్ వినేశ్ ఫొగాట్ ఆరోపణ

న్యూఢిల్లీ: లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిజ్‌భూషణ్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ దిల్లీలో అగ్రశ్రేణి క్రీడాకారులు నిరసన కొనసాగిస్తున్నారు. నిరసన దీక్షను ముందుండి నడిపిస్తోన్న స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ బుధవారం మీడియాతో మాట్లాడుతూ కేంద్ర క్రీడలశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్‌పై ఆరోపణలు చేశారు. చాలా కాలంగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతోన్న ఓ శక్తిమంతమైన వ్యక్తికి వ్యతిరేకంగా నిలబడటం చాలా కష్టమని, నాలుగు నెలల క్రితం మొదటిసారి ఆందోళన చేపట్టడానికి ముందు తాము ఓ అధికారిని కలిశామని తెలిపారు. మహిళా అథ్లెట్లు శారీరకంగా, మానసికంగా ఎలా వేధింపులకు గురవుతున్నారో మొత్తం వివరించామన్నారు. కానీ చర్యలు తీసుకోలేదని, అందుకే తాము ధర్నాకు దిగాల్సి వచ్చిందన్నారు. కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్‌తో మాట్లాడిన తర్వాత నిరసనను నిలిపి వేశామన్నారు. ఆ సమయంలో లైంగిక వేధింపుల గురించి ఆయనకు చెప్పామని, అయితే కమిటీని ఏర్పాటు చేసి, ఈ వ్యవహారాన్ని అణచివేయాలని మంత్రి ప్రయత్నించారని ఆరోపించారు. బ్రిజ్ భూషణ్‌పై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఫొగాట్ మండిపడ్డారు. మరో రెజ్లర్ బజరంగ్ పునియా మాట్లాడుతూ ఒలింపిక్స్‌కు సంబంధించి తీసుకొచ్చిన నిబంధనలు నచ్చకే రెజ్లర్లు నిరసన చేస్తున్నారని బ్రిజ్ భూషణ్ చెబుతున్నారని, ఇక్కడ సమస్య ఒలింపిక్స్ కాదని, లైంగిక వేధింపులని స్పష్టంచేశారు. నిబంధనలు ఏవైనా ట్రయల్స్ నిర్వహించే క్రీడాకారులను ఎంపిక చేస్తారని పునియా గుర్తుచేశారు.

ది కేరళ స్టోరీ నిజనిర్ధారణ అవశ్యం

- అందులోని అంశాలపై దర్యాప్తు జరిపించాలి
- సీపీఐ ఎంపీ వినయ్ విశ్వం డిమాండ్
- కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్‌కు లేఖ

న్యూఢిల్లీ: కేరళ రాష్ట్రంతో పాటు ముస్లింలకు అప్రతిష్ఠ తెచ్చే ది కేరళ స్టోరీలోని అవాస్తవాలపై దర్యాప్తు జరిపించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఎంపీ వినయ్ విశ్వం డిమాండ్ చేశారు. మతవిద్వేషాన్ని రెచ్చగొట్టే విధంగా అవాస్తవాలాధారంగా ఈ చిత్రం తెరకెక్కిందని విమర్శించారు. ఈ చిత్రాన్ని విడుదల చేసే ముందు అందులోని అంశాలు నిజ నిర్ధారణ అనివార్యమని, ఇది ప్రజలకు శ్రేయస్కరమన్నారు. ఈ చిత్రంలో చూపే అంశాలను విడుదలకు ముందే దర్శక-నిర్మాతలు నిరూపించాలని డిమాండ్ చేస్తూ బుధవారం కేంద్ర సమాచార, ప్రసారాల శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్‌కు వినయ్ విశ్వం ఓ లేఖ రాశారు. ఇస్లామోఫోబియాను ప్రచారం చేయడమే కాకుండా కేరళ రాష్ట్రం, అక్కడి ముస్లింలను అవమానించే విధంగా నిరాధార అంశాలాధారంగా ది కేరళ స్టోరీ తెరకెక్కిందని వెల్లడించారు. ఇందులోని అంశాల నిర్ధారణకు దర్యాప్తు జరిపించాలని ఐ&బీ శాఖను కోరుతున్నట్లు లేఖలో విశ్వం పేర్కొన్నారు. రాజ్యాంగం, లౌకికవాదం గురించి ప్రజలలో అవగాహన పెంచడమే కాకుండా, అవాస్తవాలను, విద్వేష ప్రచారాలను కట్టడి చేసే బాధ్యత ఐ & బీ శాఖపై ఉన్నదన్నారు. కేరళలో 32వేల మంది ముస్లిం మహిళలు గల్లంతైనట్లు, వారంతా ఐఎస్‌లో చేరినట్లు ఈ చిత్రంలో చూపారని, ఇందులో ఏ మాత్రం నిజం లేదని విశ్వం పేర్కొన్నారు. ముస్లిం వర్గాన్ని అప్రతిష్ఠపాల్జేసేలా మాజీ ముఖ్యమంత్రులు వీఎస్ అచ్యుతానందన్, ఊమెన్ చాందీ ప్రకటలను వక్రీకరించారని, అవాస్తవాలు, వక్రీకరించిన అంశాలాధారంగా ఈ చిత్రాన్ని తీశారని, ఇదే అదునుగా కొన్ని మీడియా, యూట్యూబ్ ఛానళ్లు కేరళకు వ్యతిరేకంగా ప్రచారం మొదలు పెట్టాయని వినయ్ విశ్వం వెల్లడించారు. దురుద్దేశపూరిత ఈ చర్యలను కేరళ ప్రజలు ఇప్పటికే ముక్తకంఠంతో వ్యతిరేకించినట్లు తెలిపారు. లవ్ జిహాద్ అన్నది నిరాధారమైన ఇస్లామోఫోబియా కుట్ర సిద్ధాంతమని, మతవిభజనే దీని లక్ష్యమని పేర్కొన్నారు. 2020 ఫిబ్రవరి 5న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి పార్లమెంటులో మాట్లాడుతూ లవ్ జిహాద్ కేసులు నమోదు కాలేదని చెప్పారని సీపీఐ ఎంపీ గుర్తుచేశారు. ఈ అంశాల దృష్ట్యా ది కేరళ స్టోరీ పూర్తిస్థాయిలో తప్పుడు కథనాలు, అవాస్తవాలు, వక్రీకరించిన వాస్తవాలాధారంగా విద్వేషాన్ని రెచ్చగొట్టేందుకు కేరళలో మతసామరస్యాన్ని దెబ్బతీసే ఉద్దేశంతో తెరకెక్కిందని స్పష్టమవుతోందని వెల్లడించారు. ఈ చిత్రానికి సంబంధించి తగు విధంగా చర్యలను ఐ&బీ శాఖ తీసుకుంటారని ఆశిస్తున్నట్లు లేఖలో వినయ్ విశ్వం పేర్కొన్నారు.

స్వలింగ జంటల సమస్యలపై కమిటీ

సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ: స్వలింగ జంటల సమస్యల్లో కొన్నింటి పరిష్కారానికి తీసుకోవలసిన పరిపాలనపరమైన చర్యలను గుర్తించేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేస్తామని కేంద్ర ప్రభుత్వం బుధవారం సుప్రీం కోర్టుకు తెలిపింది. ఈ విషయంలో వచ్చిన సూచనపై సానుకూలంగా ఉన్నట్లు తెలిపింది. స్వలింగ పెళ్లిళ్లకు చట్టబద్ధ గుర్తింపు కోరుతూ దాఖలైన పిటిషన్లపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. స్వలింగ పెళ్లిళ్లకు చట్టబద్ధ గుర్తింపునివ్వడం గురించి మరింత లోతుల్లోకి వెళ్లకుండా, స్వలింగ జంటలు ఎదుర్కొంటున్న కొన్ని సమస్యల పరిష్కారానికి అమలు చేయవలసిన పరిపాలనపరమైన చర్యలను గుర్తించేందుకు కేబినెట్ కార్యదర్శి నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేస్తామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. దీనికోసం చాలా మంత్రిత్వ శాఖల మధ్య సమన్వయం అవసరమని వివరించింది. కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ఈ విషయంలో ఎలాంటి పరిపాలనపరమైన చర్యలు తీసుకోవచ్చునో పిటిషనర్లు సూచించవచ్చునని తెలిపారు. ఏప్రిల్ 27న జరిగిన విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి ఓ పశ్న వేసింది. స్వలింగ పెళ్లిళ్లకు చట్టబద్ధ గుర్తింపు ఇచ్చే విషయంలో మరింత ముందుకు వెళ్లకుండా, స్వలింగ జంటలకు సాంఘిక సంక్షేమ ప్రయోజనాలు అందజేయడానికి గల అవకాశాలు ఇవ్వడం సాధ్యమవుతుందా అని ప్రశ్నించింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.